ప్రజలే ప్రభువులు

# జనబలం

ఫిబ్రవరి 2025 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-



## SC వర్గీకరణ ఉద్యమం 2.0కి విస్తరించాలి




## పునాది స్థాయి నైపుణ్యాలు పెంపొందించాలి



## యూనియన్ బడ్జెట్ 2025-26

## దారి తప్పిన పరిష్కారం.. జమిలి జపం









# యువ డాక్టర్లు ప్రజలకు భారంలేని వైద్య విధానం కోసం కృషి చేయాలి

## —డాక్టర్ జయప్రకాష్ నారాయణ్—

యువ వైద్యులు ఉత్తమ వైద్యాన్ని అందించి ప్రజలకు ఆర్థిక భారం లేకుండా చూడాలని ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. డబ్బున్నవాళ్ళు, వైద్య పర్యాటకం వల్ల కార్పొరేట్ ఆసుపత్రుల లాభాలకు ఢోకా ఉండదని, కానీ దేశంలో కోట్ల మంది సామాన్య, మధ్యతరగతి వారు వైద్య ఖర్చులతో చితికి పోకుండా, తమ ఉత్పాదక శక్తిని కోల్పోకుండా, ప్రభుత్వం ఒక సమగ్ర ఆరోగ్య విధానాన్ని అమలు చేయడం అత్యవసరమన్నారు. ప్రభుత్వ- ప్రైవేటు భాగస్వామ్యంతో, డాక్టర్ల మధ్య పోటీ, ప్రజలకు మెరుగైన సేవలు అందించే వైద్యులను ఎంచుకునే స్వేచ్ఛ ఉండేలా, చాలా తక్కువ ఖర్చుతో ఇలాంటి విధానం మనదేశంలో సాధ్యమన్నారు. ప్రైవేటు భాగస్వామ్యం ఉన్నా కూడా మొత్తంగా ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం అందేలా చూడటం ప్రభుత్వ బాధ్యతని జేపీ స్పష్టం చేశారు. సామాన్యులపై భారం పడకుండా ఆరోగ్య విధానాన్ని తేవటం వైద్యులకు కూడా అవసరమని, ఇలాంటి విధానం లేకపోవడం వల్లే ఇటీవల డాక్టర్లకు, పేషెంట్లకు మధ్య పరస్పర విశ్వాసం తగ్గిపోతోందని, ఇది సమాజానికి మంచిది కాదని అన్నారు. సరైన వైద్య విధానానికి ఆధునిక సాంకేతికతను జోడిస్తే, తక్కువ ఖర్చుతో ప్రజలకు భారం లేని వైద్యం అంది అద్భుత ఫలితాల్ని సాధించగలమన్నారు.

జాతీయ యువజన ఉత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా హైదరాబాద్ కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల ఆడిటోరియంలో నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ నిర్వహించిన కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వైద్య విద్యార్థులు, ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొన్నారు. 'వైద్య విద్య విధానాలు- గతం, వర్తమానం, భవిష్యత్తు' అంశంపై ప్యానల్ చర్చ నిర్వహించారు. డాక్టర్ ఉజ్వల్ సంధానకర్తగా వ్యవహరించగా, డాక్టర్ నరేంద్రకుమార్, డాక్టర్ అనుపమ, డాక్టర్ ఎస్వీ లక్ష్మీనారాయణ, డాక్టర్ అనిల్, డాక్టర్ రఘునందన్, డాక్టర్ ప్రవీణ్ తదితరులు ప్యానలిస్టులుగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామకృష్ణ మఠం హైదరాబాద్ డైరెక్టర్ స్వామి బోధమయానంద పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వైద్యవృత్తిలోని వారు ఒత్తిడిని ఎదుర్కోవటంలో వివేకానందుని బోధనలు ఏ రకంగా ఉపయోగపడతాయో తెలిపారు.

# జనబలం

ప్రజలే ప్రభువులు

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

ఫిబ్రవరి 2025

సంపుటి 26 | సంచిక 02


## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్



*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్





06 యూనియన్ బడ్జెట్ 2025-26 ప్రశంసనీయ ప్రయత్నం

10 అసర్-2024 కొన్ని పరిచయాంశాలు

19 చదవటంలో 27- లెక్కల్లో 13 తెలంగాణ అసర్ 2024

25 దారితప్పిన పరిష్కారం.. జమిలి జపం

27 ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని మలి దశకు తీసుకెళ్లాలి: జేపీ



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

# బాల్యంలోనే పునాది నైపుణ్యాల సాధన కీలకం!

సంపాదకీయం

గత రెండు దశాబ్దాలుగా పాఠశాల విద్యా రంగంలోని ధోరణులను లోతుగా అధ్యయనం చేస్తున్న "అసర్" తన తాజా నివేదికను దేశం ముందుంచింది."అసర్" సహా పలు విద్యారంగ చొరవలను కొనసాగిస్తున్న ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సంస్థను స్థాపించి ముప్పై సంవత్సరాలు పూర్తి అయ్యింది. యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ "అసర్" పేరిట గ్రామీణ ప్రాంతాల బడిపిల్లల చదువులపై, బడుల తీరుతెన్నులపై సర్వే నివేదికలను విడుదల చేయడం ప్రారంభించి కూడా ఇరవై సంవత్సరాలు పూర్తి అయ్యింది. అసర్ -2024 నివేదికను జనవరి 28న ప్రథమ్ సంస్థ వ్యవస్థాపక సారథులు డా.మాధవ్ చవాన్ , ఫరీదా లాంబే సంయుక్తంగా విడుదల చేసారు.

అసర్ -2024 సర్వేలో 25 వేల మంది వలంటీర్లు , వెయ్యి మంది మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు. సుమారు 620 సంస్థలు ఈ బృహత్తర యజ్ఞంలో పాలు పంచుకున్నాయి. అసర్ వలంటీర్లు దేశంలోని 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని 605 గ్రామీణ జిల్లాలకు తరలి వెళ్ళారు. సుమారు 17,997 గ్రామాలలోని 3,52,028 కుటుంబాలను కలుసుకున్నారు. కుటుంబాల ఆర్థిక, విద్యా స్థితిగతులను తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు చెందిన 5-16 వయోవర్గం లోని 6, 49, 491 మంది విద్యార్థులను కలిసి పఠనం , గణితం, అంశాల్లో వారి అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. అలాగే 15-16 వయోవర్గంలోని పిల్లల డిజిటల్ సామర్థ్యాలను కూడా పరీక్షించారు. ఆయా గ్రామాల్లోని 15,728 ప్రభుత్వ ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలను వారు సందర్శించారు. పాఠశాలల్లో ఉన్న మౌలిక వసతులు, పిల్లల, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు వంటి అంశాలపై సమాచారం సేకరించారు.

2005 నుండి 2016 వరకూ పదేళ్లపాటు ప్రథమ్ సంస్థ ప్రతి ఏటా క్రమం తప్పకుండా సర్వేలను నిర్వహించి అసర్ నివేదికలను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత అసర్ ను కుదించింది. ప్రతి ఏటా నిర్వహించే పూర్తిస్థాయి అసర్ ను రెండేళ్లకు ఒకసారి చొప్పున 2018, 2022, 2024 సంవత్సరాల్లో నిర్వహించింది. అయితే అధ్యయనాలకు అవసరమైన గణాంకాల కోసం పరిమిత స్థాయి అసర్ సర్వేను ఏడాదికి ఒకటి చొప్పున నిర్వహించింది.

గత రెండు దశాబ్దాల "అసర్" నివేదికలను వరుసగా పరిశీలిస్తే పాఠశాల విద్యలో వస్తున్న స్థూలమైన మార్పులను గమనించవచ్చు. 2005 లో తొలి అసర్ నిర్వహించే నాటికి విద్యారంగంలో నెలకొని ఉన్న నేపథ్యాన్ని ఒకసారి గుర్తు చేసుకోవడం అవసరం. ఆంధ్రప్రదేశ్లో ప్రాథమికవిద్యను బలోపేతం చేసేందుకు 90వ దశకం నాటికే అపెప్ , డిపెప్ లాంటి పథకాలు అమల్లో ఉన్నాయి. బీహార్ వంటి పలు ఇతర రాష్ట్రాలు కూడా అవే తరహా పథకాలను అమలు చేస్తున్నాయి. సరిగ్గా అదే సమయంలో కేంద్రప్రభుత్వం 15 - 35 వయోవర్గంలోని వయోజనుల కోసం సంపూర్ణ అక్షరాస్యతా ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభించింది. అది ఒక గొప్ప ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంది. తాము చదువుకోలేకపోయినా తమ పిల్లల్ని చదివించుకోవాలనే ఒక తీవ్రమైన తపనను లక్షలాది మంది తల్లితండ్రుల్లో రేకెత్తించింది. దాంతో తమ పిల్లలను బడిలో చేర్పించడానికి తల్లి తండ్రులు ఉత్సాహపడ్డారు.

ఈనేపథ్యంలో 2005 నాటికే 6-14 వయోవర్గం పిల్లల్లో దాదాపు 96.3 శాతం పాఠశాలల్లో నమోదయ్యారు. పాఠశాల నమోదులో ఆర్థిక, జెండర్ , ప్రాంతీయ , బోధనా మాధ్యమం , గ్రామీణ, పట్టణాల వారీ వ్యత్యాసాలు, ఎగుడు దిగుళ్లు తరతమ స్థాయిల్లో కొనసాగుతూ వచ్చాయి. ప్రభుత్వ - ప్రైవేటు పాఠశాలల నమోదులో కూడా వ్యత్యాసం స్పష్టంగా కనిపించింది. అయితే వ్యత్యాసాల సంగతి ఎలా ఉన్నా పాఠశాల నమోదులో స్థిరీకరణ సాధించడంలో క్రమేపీ భారతీయ సమాజం గొప్ప విజయాన్ని సాధించింది.

మధ్యాహ్న భోజనం లాంటి జాతీయస్థాయి పథకాలకూ, అమ్మఒడి వంటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నగదు బదిలీ పథకానికీ పాఠశాల నమోదు స్థిరీకరణకూ ఏమీ సంబంధం లేదని అసర్ గణాంకాలు చూస్తే స్పష్టంగా అర్థం అవుతుంది."అందరూ చదవాలి - అందరూ ఎదగాలి" నినాదంతో అమలయిన "సర్వశిక్షా అభియాన్" గత పాతికేళ్లలో కొత్త బడులను నిర్మించింది. పిల్లలకు బడిని అందుబాటులోకి తెచ్చింది. పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులను నియమించింది. బడిలో పలు సదుపాయాలను సమకూర్చింది. అయితే నమోదైన పిల్లలు బడి నుండి డ్రాప్ ఔట్ కాకుండా నిలకడగా కొనసాగడానికి ఇంకా కొంత సమయం పడుతుంది.

2005 లో వెలువడిన "అసర్ ""తొలి నివేదిక దేశంలో కలకలం సృష్టించింది. పిల్లల అభ్యసనా సామర్థ్యాలు ఘోరంగా ఉన్నాయన్నవిషయాన్ని వెల్లడించింది .అలాగే బడిలో అవసరమైన సదుపాయాలు సవ్యంగా లేవన్న వాస్తవాన్ని "అసర్ -2005" బైట పెట్టింది. ఆతర్వాత ప్రతి ఏటా వరుసగా పదేళ్లపాటు వెలువడిన అసర్ నివేదికల్లో పిల్లల అభ్యసనా సామర్థ్యాలు నాసిగా ఉన్నాయన్న సంగతి పదేపదే వెల్లడి అయింది.

తొలుత అసర్ నివేదికలపై పాలకులు, అధికారులు, ఉపాధ్యాయులు విరుచుకు పడ్డారు. కానీ అనంతర కాలంలో విద్యాశాఖ, సర్వశిక్షా అభియాన్, ఎన్.సి.ఇ.ఆర్.టి. నిర్వహించిన అంతర్గత మూల్యాంకనాల్లో కూడా అసర్ గణాంకాలు సరైనవేనని రుజువు అయ్యింది. తొలిదశలో స్టేక్ హోల్డర్లు అందరూ పరస్పర విమర్శలకు దిగి నిందను పక్కవారిమీదకు నెట్టడానికి ప్రయత్నించారు. కాలక్రమంలో అసర్ ప్రయత్నాన్ని అందరూ అర్థం చేసుకున్నారు. సమస్య పరిష్కారానికి ఆలోచించడం మొదలెట్టారు.

సమస్య ఉన్నదని గుర్తించిన రాష్ట్రాలు పిల్లల చదువుల నాణ్యతాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రయత్నాలు ప్రారంభించాయి. అక్కడ నమోదు నుండి నాణ్యత వైపుగా దృష్టి మరలింది. క్విప్, క్లాప్, క్లిప్ వంటి చొరవలు మొదలయ్యాయి. పిల్లల అభ్యసనా సామర్థ్యాలలో మెరుగుదల దిశగా ఒక దేశవ్యాప్త చలనం ప్రారంభం అయ్యింది. అసర్ -2018 నివేదిక గణాంకాలను చూస్తే సాధించిన పురోగతి మనం గమనించవచ్చు.

కరోనా మహమ్మారి విరుచుకు పడిన 2020, 2021 సంవత్సరాలలో లాక్ డౌన్ కారణంగా బడులు పూర్తిగా మూతపడ్డాయి. అలాంటి ప్రతికూల

వాతావరణంలో సైతం నూతన అవకాశాలకు ద్వారం తెరుచుకుంది. డిజిటల్ వేదికల ద్వారా పిల్లల చదువులను పట్టాలు ఎక్కించేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరిగాయి. అయితే డిజిటల్ పరికరాలు అందరికీ లేకపోవడం, ఉన్నా ఇంటర్నెట్, మొబైల్ కనెక్టివిటీ లేకపోవడం వల్ల ఆశించిన ఫలితాలు రాలేదు. 2018 నాటికి దేశం మొత్తం సమష్టిగా సాధించిన అభ్యసనా సామర్థ్యాల స్థాయి 2022 నాటికి దిగజారింది. 2020 లో కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానం తెచ్చింది. పాఠశాల విద్యలో అప్పటివరకూ అమలు చేసిన 10+2+3 చట్రం స్థానంలో 5+ 3+3+ 4 చట్రం వచ్చింది.

2021 లో పూర్వ ప్రాథమిక విద్యను పటిష్టం చేసేందుకు "నిపుణ భారత్ మిషన్" ను కేంద్రం ప్రారంభించింది. పిల్లల అభ్యసనా సామర్థ్యాలను, విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు "పునాది దశ" లోనే ప్రయత్నం జరగాలని నిపుణ భారత్ మిషన్ ఆదేశించింది. అక్షరాస్యత లోను, అంక గణితం లోనూ పునాది స్థాయి నైపుణ్యాలను (ఎఫ్.ఎల్.ఎన్.) పెంపొందించడంపై దృష్టి సారించాలని సూచించింది. ఆమేరకు అంగన్‌వాడీనీ, పూర్వ ప్రాథమిక విద్యను కలిపింది. అంగన్‌వాడీ సిబ్బందికి ఎఫ్.ఎల్.ఎన్ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వడంపై తక్షణం దృష్టి సారించాలి.

కొన్ని రాష్ట్రాలలో "టీచింగ్ ఎట్ ది రైట్ లెవెల్", "ఎఫ్.ఎల్.ఎన్." వంటి చొరవలపై ఉపాధ్యాయులను సన్నద్ధం చేసేందుకు శిక్షణా కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. పూర్వ ప్రాథమిక విద్యా స్థాయిలో ఎఫ్.ఎల్.ఎన్. కూడా పాదుకోవడం ఆరంభం అయింది. ఐదేళ్లు నిండిన పిల్లల్ని మాత్రమే ఒకటో తరగతిలో చేర్చుకోవాలని, ఐదేళ్ల లోపు పిల్లలను పాఠశాలకు సంసిద్ధం చేయడంపై దృష్టి సారించాలని నిపుణ భారత్ మిషన్ చెబుతున్నది. ఒకటో తరగతిలో ఉన్న పిల్లల్లో ఐదేళ్ల లోపు వయసున్న వారు 2018 లో 25.6 శాతం కాగా 2024 నాటికి ఆ సంఖ్య 16.7 శాతానికి తగ్గింది. అది ఇంకా తగ్గాల్సి ఉంది.

పునాది దశలో పిల్లల నైపుణ్యాలను సార్వత్రికం చేసేందుకు గడువును 2025 గా ప్రభుత్వం నిర్దేశించింది. అయితే కోల్పోయిన కరోనా కాలాన్ని, పునాది స్థాయిలో ఉన్న విద్యార్థుల సంఖ్య పదికోట్లు ఉండటాన్ని దృష్టిలో ఉంచుకుని పునాది నైపుణ్యాలు పెంపొందించడానికి మరికొంత సమయాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. విద్యాహక్కు చట్టం 2009 లో అమల్లోకి వచ్చే నాటికి బడి ఈడు పిల్లల్లో 3.7 శాతం బడిబైట ఉన్నారు. ఈ సంఖ్య 2024 నాటికి గత పదేళ్లలో ఎన్నడూ లేనంత తక్కువకు 1.6 శాతానికి తగ్గింది. కరోనా కారణంగా ఏర్పడిన అభ్యసనా సామర్థ్యాల లోటును అధిగమించడానికి పునాది నైపుణ్యాల మెరుగుదల దోహదం చేస్తుందని విద్యావేత్తలు ఆశిస్తున్నారు. ఆమేరకు అసర్ - 2024 నివేదిక చిన్నపాటి భరోసా ఇచ్చింది.

ఒకప్పుడు అభ్యసనా సామర్థ్యాల విషయంలో జాతీయస్థాయి సగటు కంటే తక్కువ స్థాయిలో ఉంటూ వచ్చిన ఉత్తరప్రదేశ్ లో పరిస్థితి మెరుగు పడటం ఆశాజనకంగా ఉంది. హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో కూడా 2018 నాటి సామర్థ్యాల దిశగా ముందడుగు పడింది. అయితే బడి బైట మిగిలిపోయిన సుమారు నలభై లక్షల మంది పిల్లల్ని నమోదు చేయడమనే బాధ్యత ఇంకా మనపై మిగిలే ఉంది. ముఖ్యంగా బాలికా విద్య విషయంలో ఇంకా కొన్ని రాష్ట్రాల్లో కనిపిస్తున్న వివక్ష ఆందోళన కలిగిస్తున్నది.11-15 ఏళ్లు వచ్చాక బాలికలను బడిమాన్పించే ధోరణి పలు రాష్ట్రాల్లో కనిపిస్తున్నది. పదిహేను ఏళ్ళ వయసులో బడిబైటి బాలికల శాతం బాగా ఎక్కువ ఉన్న మధ్య ప్రదేశ్ (16.1) ఉత్తర ప్రదేశ్ (15) , రాజస్థాన్ (12.7), మిజోరాం (12.3), గుజరాత్( 10.5 ) ఛత్తీస్ గడ్ (10) వంటి రాష్ట్రాల్లో బాలికల విద్య కోసం ప్రత్యేక ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉంది.

అలాగే దేశంలో మల్టిగ్రేడ్ తరగతుల బెడద తీవ్రంగా ఉంది. ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతి పిల్లల్ని వేరే తరగతి పిల్లలతో కలిపి ఒకే గదిలో కూచోబెట్టే విధానం 67 శాతం పాఠశాలల్లో అమల్లో ఉంది. బోధనాభ్యసన ప్రక్రియలో తీవ్రమైన కొరత ఏర్పడటానికి మల్టీగ్రేడ్ తరగతులు ఒక ముఖ్య కారణం.మనదేశంలో 25 కోట్ల మంది విద్యార్థులకు 15 లక్షల పాఠశాలలు ఉన్నాయి.విద్యార్థుల సంఖ్య 30 కంటే తక్కువ ఉన్న పాఠశాలలు కూడా చాలా ఎక్కువే ఉన్నాయి. దానికి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. పాఠశాలలను విలీనం చేసి భారీస్కూలు కాంప్లెక్సుల ఏర్పాటు దిశగా దృష్టి మరలాలి. ఉపాధ్యాయుల సంఖ్యను గణనీయంగా పెంచాలి. పరీక్షా విధానాన్ని కూడా సంస్కరించాలి. విద్యారంగం బడ్జెట్ ను జిడిపిలో కనీసం ఆరు శాతానికి పెంచాలి. చైనా, వియత్నాం, శ్రీలంక వంటి దేశాలలో విద్యారంగంలో ప్రవేశపెట్టిన నమూనాలను మన అవసరాలకు అనుగుణంగా మార్చుకోవడంపై ఆలోచించాలి.

అసర్ -2024 సర్వేలో 15-16 వయో వర్గం పిల్లల డిజిటల్ సామర్థ్యాల గురించి తెలుసుకునే ప్రయత్నం జరిగింది. ఇంటిలో స్మార్ట్ ఫోన్ ఉన్న పిల్లలసంఖ్య దాదాపు తొంభై శాతం ఉండటం ఒక సానుకూల పరిణామం. దాదాపు 82 శాతం పిల్లలకి స్మార్ట్ ఫోన్ ఉపయోగించడం వచ్చు. అందులో దాదాపు 57 శాతం మంది సర్వే జరిగిన వారంలో స్మార్ట్ ఫోన్ ను విద్యా సంబంధ కృత్యాల కోసం వినియోగించారు. అలాగే మరో 76 శాతం మంది స్మార్ట్ ఫోన్ ను సోషల్ మీడియా కృత్యాల కోసం వినియోగించారు.డిజిటల్ అభ్యసనానికి అవసరమైన సంసిద్ధత మన కుటుంబాల్లో ఉందని తేలింది.దాన్ని తరగతి గదిలోకి తీసుకు రావడంపై దృష్టి సారించాల్సి ఉంది.

స్వాతంత్ర్య శత వార్షికోత్సవాలను మనం 2047 లో జరుపుకో బోతున్నాం. భారతీయ జనాభా మధ్యగత వయసు ప్రస్తుతం ఇరవై తొమ్మిదిగా ఉంది. జనాభాపరంగా ఉన్న గొప్ప సానుకూలతను ఇప్పుడే వినియోగించుకోవడంపై దృష్టి పెట్టాలి. ఈ తరుణాన్ని వదులుకుంటే సమాజం పూర్తిగా నష్ట పోతుంది.

తరుణ బాలల పునాది నైపుణ్యాలను మెరుగుపరచడం, పాఠశాల విద్యలో నూరు శాతం నమోదును స్థిరీకరించడం, అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించడం లక్ష్యాలుగా మరో పదేళ్లు కృషి చేయాలి. అలా చేస్తే మన బడులు బాగుపడతాయి. పిల్లల చదువులు మెరుగుపడతాయి. అందుకు ప్రభుత్వాలు, విధాన నిర్ణేతలు , ఉపాధ్యాయులు , తల్లితండ్రులు కలిసి పనిచేయాలని, విద్యను సమష్టి బాధ్యతగా మన సమాజం స్వీకరించాలని అసర్ -2024 సందేశం ఇస్తున్నది.

డి. సోమ సుందర్

# యూనియన్ బడ్జెట్ 2025-26 ప్రశంసనీయ ప్రయత్నం

## -డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-

*దేశీయంగా, అంతర్జాతీయంగా సవాళ్లు, అనిశ్చితులు పెరిగిన తరుణంలో.. పెట్టుబడుల్ని, వినియోగాన్ని ప్రోత్సహిస్తూ, అప్పుల భారాన్ని తగ్గిస్తూ, రాష్ట్రాల హక్కుల్ని పరిరక్షిస్తూ, సమతూకాన్ని పాటిస్తూ సుస్థిరాభివృద్ధికి దోహదం చేసే ఒక మంచి బడ్జెట్‌ను జాతీయస్థాయి ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డిఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అభినందించారు.*

**ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్ 2025 - 26పై జేపీ స్పందన ముఖ్యాంశాలు :**



యూనియన్ ప్రభుత్వ తాజా బడ్జెట్ ఒకరకంగా గతాన్ని కొనసాగిస్తోంది. దీన్లో కొత్తవి, ఆశ్చర్యకరమైనవి, దిగ్భ్రాంతికరమైనవి ఏవీ లేవు. ఉదాహరణకి, నాలుగేళ్ల క్రితం కొవిడ్ వల్ల ప్రభుత్వానికి ఆదాయం తగ్గి, అప్పులు పెరిగాయి. కానీ, గత మూడేళ్లుగా కాలక్రమేణా అప్పుల భారాన్ని తగ్గిస్తున్నారు. ఆ నిబద్ధతని కొనసాగించారు. అదే సమయంలో చాలా పెద్దఎత్తున మధ్యతరగతి వర్గాలకి పన్నుల భారాన్ని తగ్గించారు. మరి ఈ రెండూ చేసినప్పుడు, దేశంలో భవిష్యత్తు కోసం చేసే ఖర్చు, పెట్టుబడులు తగ్గినాయా అంటే, గత రెండేళ్ల లాగానే రికార్డు స్థాయిలో పెంచారు. ఈ మూడింటినీ కలుపుతూ గతంలోని మంచిని కొనసాగించడం ఒక అద్భుతమైన విషయం. ఎందుకంటే, ఈవేళ ప్రపంచంలో ఆర్థిక ప్రగతికి ప్రతికూల పవనాలు వీస్తున్నాయి. గ్లోబల్ హెడ్‌విండ్స్ అంటాం.

ఓపక్కన యూరప్ లోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, గత 30-40 ఏళ్లుగా నిరంతరం ఆర్థిక ప్రగతిని సాధించిన జర్మనీ లాంటి దేశాలు కూడా కొంచెం ఖాయిలా పడుతున్నాయి. మరోపక్కన డొనాల్డ్ ట్రంప్ ఎన్నిక వల్ల ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అమెరికా వైఖరిలో మార్పు వచ్చింది. అంతర్జాతీయ ఆర్థికంలో 27 శాతం వాటాగల అమెరికా ఒకప్పుడు, 'ఇతర దేశాల అభివృద్ధి కూడా కావాలి, స్వేచ్ఛా వాణిజ్యం కావాలి, అందరినీ పెంచాలి, మనం కూడా పెరగాలి' అని భావించేది. కానీ ఇప్పుడు, 'అమెరికా ఫస్ట్, మిగతా దేశాలు ఏమైనా మాకు పరవాలేదు, అలాగే ఆ దేశాల నుంచి దిగుమతుల్ని మేము ఒప్పుకోం, పెద్దఎత్తున దిగుమతి సుంకాల్ని విధిస్తాం, దిగుమతుల్ని నిరుత్సాహపరుస్తాం, పెట్టుబడులన్నీ మా దేశంలోనే రావాలి, బయటికెళ్లటానికి వీల్లేదు' అనే పద్ధతి తీసుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో కచ్చితంగా మనకి విదేశాల నుంచి పెట్టుబడులు తగ్గుతాయి. మన దేశం నుంచి ఎగుమతులు తగ్గుతాయి. అంతర్జాతీయ వాణిజ్యం తగ్గటం చేత బహుశా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత బలహీనపడుతుంది. దాన్లో భాగంగా మనం కూడా నష్టపోతాం. అందులో ఎదుగుతున్న దేశంగా! ఈ నేపథ్యంలో తీసుకొచ్చిన యూనియన్ బడ్జెట్

ప్రశంసనీయమైనది.

ఏ ఆర్థికమంత్రీ, ఏ ప్రభుత్వాలూ అద్భుతాలు సృష్టించలేరు. కానీ, ఉన్న వనరుల పరిమితిలో ఆర్థిక ప్రగతిని పెంచటానికి ఏర్పాట్లు చేశారా, లేదా? ఆ రకంగా చూస్తే మొట్టమొదటిది ఆర్థిక క్రమశిక్షణ. అంటే, ప్రభుత్వ అప్పుల భారాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతోందా, లేదా?

కొవిడ్ వల్ల జాతీయాదాయంలో 9.2 శాతానికి అప్పుల భారం పెరిగింది. 30 ఏళ్ల క్రితం, అప్పులు చూపించకుండా నోట్లు ముద్రించేవారు. నోట్లు ముద్రించటం వల్ల, మార్కెట్లో డబ్బు ఎక్కువై వస్తువుల ఉత్పత్తి లేకపోవటం వల్ల ధరలు పెరిగేవి. అధిక ద్రవ్యోల్బణం వల్ల బాగా నష్టపోయేది నిరుపేదలు. డబ్బున్నవాళ్లకి ధరలు పెరిగితే నష్టమేం లేదు. వాళ్ల మౌలికమైన జీవితంలో ఏరకమైన ఒడిదుడుకులూ ఉండవు. ఆహారంగానీ, ఇల్లుగానీ, బట్టలుకానీ, జీవితావసరాలు, విద్య, ఆరోగ్యం గానీ ఎక్కడా వారికి ఇబ్బందులుండవు. కానీ డబ్బులేనివాళ్లు వంద రూపాయలు సంపాదిస్తే వందకు వంద రూపాయలూ బతకటానికే సరిపోతాయి. వాళ్ల తిండికీ, ఇల్లు, బట్టలు, పిల్లల్ని చూసుకోవడానికీ, ఆరోగ్యానికీ పూర్తిగా ఖర్చయిపోతుంది. అందుకని 30 ఏళ్ల క్రితం నుంచీ నోట్లు ముద్రించకుండా, ప్రభుత్వ లోటు, ప్రభుత్వ ఖర్చుకూ మన మీద ధరల పెరుగుదల భారం కనిపించకుండా, అప్పులు చేయటం మొదలుపెట్టారు. అప్పులు చేస్తే వడ్డీలు, అప్పులు చెల్లించాలి. ఆర్థిక క్రమశిక్షణ అనివార్యమవుతుంది. మూడేళ్ల క్రితం 9.2% ఉన్న అప్పును నడుస్తున్న సంవత్సరంలో 4.9 శాతానికి తగ్గిస్తామని మాట ఇచ్చారు. హామీని నిలబెట్టుకుని 4.8% చేశారు. వచ్చే సంవత్సరం 4.4%కి అంచనా వేశారు. గత మూడేళ్ల చరిత్ర చూసినట్లయితే, కచ్చితంగా ఈ అంచనాల్ని అమలుచేస్తారని అనుకోవచ్చు. బహుశా ఇంతకంటే మెరుగ్గా చెయ్యొచ్చు. కాబట్టి, ఆర్థిక ప్రగతికి ఇబ్బంది లేకుండా, అప్పుల భారం పెరగకుండా, మన పిల్లల మీద భారం ఎక్కువవకుండా ప్రభుత్వ రుణాల్ని తగ్గిస్తున్నారు.



రెండోది, అదే సమయంలో క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్. అంటే భవిష్యత్తు కోసం పెట్టుబడి వ్యయం. గత మూడేళ్లలో జాతీయ స్థాయిలో రికార్డు స్థాయిలో మూలధన పెట్టుబడులు పెడుతున్నారు. నడుస్తున్న సంవత్సరం, ఉదాహరణకి, 10.1లక్షల కోట్లు ఖర్చు పెడుతుంటే, మొదటి మూడు నెలలు ఎన్నికల కారణంగా ఖర్చు బాగా తగ్గినా, మిగతా 9 నెలల కాలంలో అనుకున్నంతగా ఖర్చు పెట్టగలుగుతున్నారు. ఇదే రికార్డుస్థాయిని కొనసాగిస్తూ, వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదనల్ని రూ.11.21 లక్షల కోట్లకు పెంచారు. దాంతోపాటు రాష్ట్రాలకు 50 ఏళ్లపాటు వడ్డీ లేని రుణం. 50 ఏళ్లకి రుణం, వడ్డీ లేదు అంటే, ఉచితంగా ఇచ్చినట్లు లెక్క ; కాగితం మీద అప్పుగా ఉన్నా, 50 ఏళ్ల తరువాత ఇవాల్టి రూపాయి బహుశా 10 పైసలు కూడా చేయదు. ఈ రెండూ కలిపితే రూ.12.75 లక్షల కోట్లు, రికార్డు స్థాయిలో మళ్లీ పెట్టుబడుల మీద పెట్టటం.

ఇవన్నీ చేస్తూనే, చరిత్రలో ఎన్నడూ లేని స్థాయిలో ఏడాదికి రూ.12 లక్షల ఆదాయం దాకా ఆదాయపు పన్ను లేకుండా చేశారు. ఇది ఎవ్వరూ ఊహించలేదు. ఏదో కొద్దిగా చిన్నచిన్న మార్పులు చేస్తారనుకున్నారు. పదేళ్ల క్రితం ఆదాయపు పన్ను పరిమితి రూ. 2,50,000 దాకా వుండేది. ఇప్పుడది ఐదు రెట్లు పెరిగింది. అమెరికానే చూడండి. ఆ దేశంలో ఒక డాలర్‌కి మారకపు విలువ రూ.86 పైన కాగితం మీద ఉన్నా కూడా, కొనుగోలు విలువ నిజానికి రూ.20 మాత్రమే. ఒక డాలర్‌తో అమెరికాలో కొనేది మన దేశంలో రూ.20తో కొనొచ్చు. ఈ మారకం విలువకీ, కొనుగోలు శక్తికీ నాలుగు రెట్లు తేడా వుంది. ఆరకంగా లెక్కేస్తే 11,600 డాలర్ల దాకా, అంటే దానిని 20తో హెచ్చించినట్లయితే రూ. 2,40,000 ఏడాదికి. అంటే నెలకి రూ. 20,000 ఆదాయం కింద లెక్క ; ఆమాత్రం ఆదాయం వస్తే అమెరికాలో 10% ఆదాయపు పన్ను కట్టాలి. 11,600 డాలర్ల నుంచీ 47,500 డాలర్ల వరకూ, అంటే కొనుగోలు శక్తి రీత్యా మనకు రూ.10 లక్షల వరకూ 12% ఆదాయపు పన్ను కట్టాలి. ఆపైన అంటే రూ. 10 లక్షల ఆదాయం దాటితే 22% ఆదాయ పన్ను కట్టాలి. అలాంటిది మనదేశంలో, 12 లక్షల రూపాయల దాకా, అంటే అమెరికాలో కొనుగోలురీత్యా ఏడాదికి 60,000 డాలర్లతో సమానం, పన్ను లేదు. ఇది సామాన్యమైన విషయం కాదు.


మధ్యతరగతికి, ప్రభుత్వంలోకానీ, ప్రయివేటులోకానీ ఉద్యోగాలు చేసేవారికి అపారమైన ఊరట. వారు ఆ డబ్బును పొదుపు చేసుకోవచ్చు. మార్కెట్లో అవసరమైనవి కొనుక్కుంటే డిమాండ్ పెరుగుతుంది. ప్రభుత్వం పెట్టుబడులు పెడుతోంది, కానీ ప్రజల కొనుగోలు శక్తి పెరగకుండా ఎలా? అని చాలాకాలంగా ఆర్థికవేత్తలు అంటున్నారు. దీనివల్ల కొనుగోలు శక్తి పెరుగుతుంది.

ఓపక్కన ఆర్థిక ప్రగతి కోసం పెట్టుబడులను ప్రోత్సహించటం, మరోపక్కన అప్పుల భారం తగ్గించటం, మూడో పక్కన పన్నుల భారం తగ్గించి, మన చేతుల్లో డబ్బు అదనంగా చేర్చటం – మూడూ కలిపి చేయటం నిజంగా గొప్ప విషయంగా చెప్పుకోవాలి. దానిని సాధించారు.

దాంతోపాటు, సామాన్యులకు, బీదలకీ, అసంఘటిత రంగంలో ఉన్నవారికి రకరకాల పద్ధతుల్లో ఉపాధికల్పన, ఆదాయాల పెంపు కోసం పెట్టుబడులు, పారిశ్రామికీకరణ మీద దృష్టి పెట్టారు. ఉపాధి కల్పన మీద ప్రధానంగా దృష్టి పెట్టిన కారణంగా ఎన్నో రంగాల్లో – వ్యవసాయం కావచ్చు, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు కావచ్చు, లేకపోతే గ్రామీణ, లేదా చిన్న పట్టణాలు కావచ్చు – ప్రోత్సాహకాలనిచ్చారు. ఆట వస్తువులు, ఎలక్ట్రానిక్స్ దగ్గరనుంచీ, తోలుతో తయారుచేసే చెప్పులు వగైరాల దగ్గరనుంచి, ఎక్కడెక్కడైతే ఉపాధికి అవకాశముందో, అక్కడ రకరకాల ప్రోత్సాహకాలు, విధానాలు, పద్ధతులు ప్రవేశపెట్టారు. అంటే, ఆర్థిక ప్రగతి ఫలితాలు కేవలం డబ్బున్నవారికే కాకుండా, నెల జీతం, జీవిత భద్రత ఉన్నవాళ్లకే కాకుండా – బీదలు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ రంగాల్లో ఉన్నవారు, తక్కువ నైపుణ్యాలతో, తక్కువ ఆదాయం పొందేవారికి కూడా అందేందుకు వారి నైపుణ్యాల్ని పెంచటానికి, వారి బతుకుల్ని మార్చటానికి గట్టిగా ప్రయత్నం జరిగింది. అందుకు ఆర్థికమంత్రిని మనస్ఫూర్తిగా అభినందించాలి.

అదేవిధంగా వ్యాపారాన్ని సులభతరం చేయటం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్). మన దేశంలో వ్యాపారం చేద్దామనుకుంటే అన్నీ అడ్డంకులే. ఎన్నో చట్టాల్లో రూల్‌కి అనుగుణంగా వ్యవహరించలేదని జైలుశిక్షలు వేస్తారు. ప్రతిదాన్నీ నేరంగా పరిగణించే ఆ పద్ధతిని తొలగించే ప్రయత్నం కొనసాగుతోంది. వ్యాపారం చేయటంలో చట్టం వల్ల ఇబ్బందులు రాకుండా, అధికార యంత్రాంగం హింసలు పెట్టకుండా, లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేకుండా మరింతగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు. సంతోషం.

ఆర్థికమంత్రే చెప్పినట్లు, దేశంలోని ఎగుమతుల్లో 40%




పైగా చిన్న, మధ్యతరగతి పరిశ్రమల నుంచి వస్తోంది. కాబట్టి ఎంఎస్ఎంఈలకు మరింత ప్రోత్సాహకాలను ప్రకటించారు. డబ్బులు, రుణాలు కావచ్చు, చట్టంలో లొసుగులు తొలగించటం కావచ్చు, ఇబ్బంది లేకుండా వ్యాపారం చేసే ఏర్పాట్లు కావచ్చు, నైపుణ్యాల్ని పెంచటం కావచ్చు! అలాగే వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికీ బలమైన చర్యలు. మొత్తమ్మీద ఆర్థికాభివృద్ధిని పెంచటం లక్ష్యాన్ని కొనసాగించారు.

బడ్జెట్లో కనిపించిన ఇంకో అంశం, గతంలో ఏ అంకెలు చెప్పారో, వాటికి కట్టుబడివుండటం. మామూలుగా చాలా రాష్ట్రాల్లో, ఆదాయాలను చాలా ఎక్కువగా అంచనా వేస్తూ ఖర్చుల్ని చాలా తక్కువ చూపెడతారు. బడ్జెట్ బాగుందని ఆ రెండు రోజులూ మీడియాలో వస్తుంది. తీరా సంవత్సరం పూర్తయ్యేసరికి ఆదాయాలు అనుకున్నదానికంటే తగ్గుతాయి, ఖర్చు అనుకున్నదానికంటే ఉన్నకొద్దీ పెరుగుతుంది. అప్పుల భారం పెరుగుతుంది, ప్రజలకు ఫలితాలు కనిపించవు. పెట్టుబడుల మీద కాకుండా, తాత్కాలిక తాయిలాలు, లంచాలు మింగటం మీద దృష్టి ఎక్కువగా ఉండటం ఇందుకు ప్రధాన కారణం. అలాకాకుండా, యూనియన్ బడ్జెట్లో గత 3–4 ఏళ్లుగా ఆదాయాలు అంచనాల ప్రకారమే వస్తున్నాయి. చిన్నచిన్న తేడాలుంటున్నాయి. అలాగే ఖర్చులు అంచనాల ప్రకారమే ఉంటున్నాయి. పెట్టుబడులు అనుకున్నంత పెడుతున్నారు. అప్పుల భారం ఉన్నకొద్దీ తగ్గిస్తున్నారు. అంటే క్రమశిక్షణ కనిపిస్తోంది. నిజాయితీగా ప్రజలకు పద్దుల వాస్తవాలు తెలియజేస్తున్నారు. బడ్జెట్ అంటే అదేకదా! మన ఆర్థిక ప్రగతిని ప్రజల ముందు పెట్టటం. ఎంత ఆదాయం వస్తోందీ, ఎంత ఖర్చవుతోందీ, ఏ రూపంలో ఖర్చుపెడుతున్నారు? – దాన్లో ఒక నిలకడ, నిజాయితీ కనిపిస్తున్నాయి.

ఇక చివరి విషయం, రాష్ట్రాలకు సంబంధించి చాలామందికి

ఈ విషయం సరిగా తెలియదు. రాష్ట్రాలకు గణనీయంగా జాతీయస్థాయిలో వచ్చిన ఆదాయం నుంచి డబ్బులు వెళుతున్నాయి. ఉదాహరణకు వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్ చూసినట్లయితే, మొత్తం జాతీయాదాయంలో ప్రభుత్వానికి వస్తున్న పూర్తి ఆదాయం – పన్నుల రూపంలోగానీ, పన్నులు కాకుండా ఇతరత్రా ఆదాయంగానీ కలిపితే రూ.48,33,000 కోట్లు. దాన్లో వివిధ పద్దుల కింద – ఆర్థిక సంఘం ద్వారా కావచ్చు, కొన్ని రకాల గ్రాంట్లు వగైరాలు కావచ్చు, ఇతరత్రా పెట్టే డబ్బులు కావచ్చు, కేంద్ర ప్రతిపాదిత పథకాలు కావచ్చు – ఇవన్నీ కలిపితే రాష్ట్రాలకు వెళుతున్న డబ్బు 25,60,000 కోట్లు. అంటే యూనియన్ ఆదాయంలో దాదాపు 53% రాష్ట్రాలకు వెళుతోంది. చాలా రాష్ట్రాలు మాకు డబ్బులు రావటంలేదు జాతీయస్థాయి నుంచి, మాకు అన్యాయం జరుగుతోంది అంటున్నాయి. చాలామంది మాకు పన్నుల ఆదాయంలో 50% రావాలి అని ప్రతిపాదిస్తున్నారు. నిజమే, ఆర్థిక సంఘం ద్వారా వచ్చే నిధులు పన్నులలో మనకి 41%. సెస్‌లు, సర్‌ఛార్జీలు మినహాయించి డివిజబుల్ పూల్ అంటారు; కానీ ఆర్థిక సంఘం ద్వారా వచ్చే ఇతర నిధులున్నాయి. ఉదాహరణకి, ఆర్థిక సంఘం రెవెన్యూ లోటు, గ్రాంట్లు ఇస్తుంది. రాష్ట్రాలకు ఆదాయం కంటే ఖర్చు ఎక్కువ ఉంటే గ్రాంట్లు ఇస్తున్నారు. ఇది ఆర్థిక సంఘం ఇచ్చే, మామూలుగా జాతీయస్థాయి నుంచి బదిలీ అయ్యే డబ్బుకి అదనం. అదేవిధంగా అదనంగా స్థానిక ప్రభుత్వాలకు గ్రాంట్లు ఇస్తున్నారు. కేంద్ర ప్రతిపాదిత పథకాల అమలు కోసం యూనియన్ వాటాగా గణనీయంగా రాష్ట్రాలకి నిధులు అందుతున్నాయి. అవికాక పెట్టుబడుల కోసం వడ్డీలేని రుణాలు ఇస్తున్నారు. ఇవన్నీ లెక్కేస్తే మొత్తం ఆదాయంలో 53% దాకా వస్తోంది రాష్ట్రాలకి. రాష్ట్రాల మధ్య గ్రాంట్ల పంపిణీని ప్రస్తుతం 16వ ఆర్థిక సంఘం నిర్ణయిస్తుంది. ఇవాళ దేశ భవిష్యత్తు రాష్ట్రాల చేతుల్లో ఉంది, జాతీయ స్థాయి చేతుల్లో లేదు. జాతీయస్థాయిలో కొన్ని విధానాలు రూపొందించగలరు, కొన్ని మార్గాలని సూచించగలరు, కొన్ని ప్రోత్సాహకాల్ని ప్రకటించగలరు. కానీ పరిపాలన నూటికి 90 పాళ్లు ఉన్నది రాష్ట్రాల చేతుల్లో. ప్రతి రాష్ట్ర ప్రగతి, రాష్ట్ర భవిష్యత్తు, అక్కడి ప్రజల పేదరిక నిర్మూలన రాష్ట్రాల చేతుల్లో ఉంది.

గత 3–4 ఏళ్లుగా బడ్జెట్‌ను చూసినట్లయితే జాతీయస్థాయిలో చాలామేర వారి పాత్ర వారు నిర్వహిస్తున్నారు. ఇంకా మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. కానీ రాష్ట్రాలు ఇవాళ గట్టిగా పట్టించుకోవాలి. ఉదాహరణకి, ప్రైవేటు పెట్టుబడి పెడితే పాపం చేసినట్లు

**ఇవాళ దేశ భవిష్యత్తు రాష్ట్రాల చేతుల్లో ఉంది, జాతీయ స్థాయి చేతుల్లో లేదు. జాతీయస్థాయిలో కొన్ని విధానాలు రూపొందించగలరు, కొన్ని మార్గాలని సూచించగలరు, కొన్ని ప్రోత్సాహకాల్ని ప్రకటించగలరు. కానీ పరిపాలన నూటికి 90 పాళ్లు ఉన్నది రాష్ట్రాల చేతుల్లో. ప్రతి రాష్ట్ర ప్రగతి, రాష్ట్ర భవిష్యత్తు, అక్కడి ప్రజల పేదరిక నిర్మూలన రాష్ట్రాల చేతుల్లో ఉంది.**


చూస్తున్నారు. ప్రతిదానిలో లంచాలు లేకుండా, వేధించటం లేకుండా, రాజకీయ కక్షలు, కార్పణ్యాలు లేకుండా, పెట్టుబడుల్ని పెంచి, ఉపాధి కల్పించి, ఆదాయాల్ని పెంచి, బీదరికాన్ని తొలగించే ఏర్పాటు జరుగుతోందా? తాత్కాలిక వ్యక్తిగత సంక్షేమం, తాయిలాల మీద దృష్టి కాకుండా, దాంతోపాటు ఆర్థిక ప్రగతి, పెట్టుబడులకు పెద్దపీట వేసి సమతూకాన్ని పాటిస్తారా? మౌలిక సదుపాయాలు కల్పించి, కొత్త పెట్టుబడులకి, కొత్త ఉపాధికి, ఆదాయాలు పెరగటానికి మార్గాల్ని ఏర్పరుస్తారా? ఆదాయం తక్కువ వచ్చి, ఖర్చు విపరీతంగా ఉండి, దాన్లో కమీషన్లు ఉండేటువంటి పెద్దపెద్ద ప్రాజెక్టులను ఆర్భాటంగా ప్రకటించి, అర్థాంతరంగా ఇష్టం వచ్చినట్లు అమలుచేసి, చివరికి చతికిలపడతారా?, లేక దీర్ఘకాలంలో ఆదాయం పెంచటం కోసం పెట్టుబడులకు పెద్దపీట వేస్తారా? – ఇవన్నీ రాష్ట్రాల చేతుల్లో వున్నాయి.

కాబట్టి ఇవాళ ఒకరకంగా ఆర్థికమంత్రి రాష్ట్రాలకి, ఈ దేశంలో పెట్టుబడి పెట్టేవారికి, ఒక సవాలు విసిరారు. ప్రభుత్వం తాను చేయాల్సింది జాతీయస్థాయిలో చేస్తోంది. ఆర్థిక ప్రగతి ప్రభుత్వం చేతుల్లో లేదు. ప్రభుత్వం భగవంతుడు కాదు. ప్రభుత్వాలు అద్భుతాలు చేయలేవు. ప్రభుత్వాలు పన్నుల డబ్బుని సద్వినియోగం చేయగలవు, ప్రజల ఆర్థిక ప్రగతి పెట్టుబడులకీ ఉపాధి కల్పనకీ, పారిశ్రామికీకరణకీ ఒక మార్గాన్ని ఏర్పరచగలవు. ప్రోత్సాహకాల్ని ఇవ్వగలవు. ఆ మార్గాన్ని ఉపయోగించుకునే బాధ్యత మనది. ఆ ప్రయత్నాన్ని మనమంతా చేస్తామని ఆశిస్తూ, ప్రపంచంలో ఇవాళున్న చాలా కష్టకాలంలో, దానిని ఎదుర్కొనే విశ్వాసాన్ని కల్పిస్తూ, సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా ఒక మంచి బడ్జెట్‌ను రూపొందించినందుకు ఆర్థికమంత్రికి మనసారా అభినందనలు. ✪

# అసర్ 2024
# కొన్ని పరిచయాంశాలు



*విద్య లక్ష్యం బిడ్డ తెలివితేటలు, బుద్ధి వికసించేలా చేయటం. సమాజానికి పనికొచ్చే పనుల ద్వారా ఉపాధి పొందే సామర్థ్యాన్ని అందించడం. కాబట్టి, ఎలాగైతే పరిపాలన పౌరులు కేంద్ర బిందువుగా జరగాలో, విద్యాబోధన విద్యార్థి కేంద్ర బిందువుగా జరగాలి. విద్యారంగంలో వెచ్చించే ప్రతి రూపాయీ, చేసే ప్రతి ప్రయత్నం పిల్లలు ఏం నేర్చుకుంటున్నారనే లక్ష్యంగా సాగాలి. ఉపాధ్యాయుల జీతభత్యాలు, మౌలిక వసతులు మొదలైనవన్నీ ఈ లక్ష్యాన్ని అనుసరించి సాగాలి. ఈ నేపథ్యంలోనే భారత దేశంలో పాఠశాల విద్యా ప్రమాణాలను వేరీజు వేసే లక్ష్యంతో 'ప్రథమ్ ' అనే స్వచ్ఛంద సంస్థ 'అసర్' (వార్షిక విద్యా స్థాయి నివేదిక- యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్)ను **20**ఏళ్లుగా విడుదల చేస్తోంది. తొలి అసర్ నివేదికను **2005**లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు మౌంటెక్ సింగ్ ఆహ్లువాలియాతో కలిసి ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్),లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఢిల్లీలో విడుదల చేశారు. తాజాగా జనవరి* **28, 2025**న *అసర్* **-2024** *ప్రాథమిక నివేదిక ప్రథమ వ్యవస్థాపకులు డాక్టర్ మాధవ్ ఛవన్, ఫరీదా లాంబే విడుదల చేశారు.*



అసర్ ప్రధానంగా గ్రామీణ భారతదేశంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పిల్లల ప్రాథమిక పరిజ్ఞానాన్ని అంచనా వేసే సర్వే. అంటే చదవడం, కూడికలు, తీసివేతలు చేయటం వంటి సామర్థ్యాల్ని పరీక్షించటం. 2009లో భారతదేశం పాల్గొని 74 దేశాల మధ్య 73వ స్థానం పొందిన 'పీసా' సర్వేలోలా ఎందుకు కూడాలి, ఎందుకు భాగాహారం చేయాలి, సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలు వెతకటం వంటి లోతైన పరీక్షలు ఏవీ అసర్‌లో ఉండవు. 2004-05 నుంచి అసర్ శాంపిల్స్ పరిధి విస్తరిస్తూ వచ్చింది. కొవిడ్ వంటి అవరోధాలు ఎదురైన సందర్భాల్లో




మినహాయించి ప్రతి సంవత్సరం అసర్ సర్వేలు వెలవడుతున్నాయి.

## అసర్ 2024

☞ అసర్-2024 లో భాగంగా భారత్ లోని దాదాపు అన్ని గ్రామీణ జిల్లాల్లోనూ సర్వే చేశారు. 605 గ్రామీణ జిల్లాల్లో 17,997 గ్రామాల్లో 6,49,491 మంది పిల్లల్ని ప్రశ్నలడిగి




సామర్థ్యాన్ని బేరీజు వేశారు. 19 భాషల్లో సర్వే జరిగింది.

☞ ఈసారి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో 3-16 సంవత్సరాల పిల్లలు స్కూళ్లలో నమోదవటం, 5-16 సంవత్సరాల పిల్లలు ప్రాథమిక అభ్యసన సామర్థ్యాలతో పాటు 14-16 సంవత్సరాల వారికి డిజిటల్ సౌకర్యాల అందుబాటు, వాటి వినియోగ సామర్థ్యాన్ని కూడా మదింపు చేశారు.

☞ తాజా సర్వేలో భాగంగా అసర్ వలంటీర్లు ప్రాథమిక విద్య సెక్షన్లున్న 15,728 ప్రభుత్వ స్కూళ్లను కూడా సందర్శించారు.

☞ నమూనాగా ఎంచుకున్న గ్రామంలో ఒకటి కంటే ఎక్కువ ప్రభుత్వ పాఠశాలలు ఉంటే, ప్రైమరీ సెక్షన్లలో అత్యధిక పిల్లలు ఉన్న స్కూలును ఎంచుకోవటమైనది.

☞ 8,504 ప్రాథమిక పాఠశాలల్ని, 7,224 ప్రాథమికోన్నత లేక హయ్యర్ గ్రేడ్లు, అదే సమయంలో ప్రైమరీ సెక్షన్లు ఉన్న స్కూళ్ళని సందర్శించారు.

☞ గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలను కూడా ఒకటి రవాణా సౌకర్యం పెద్దగా లేని మారుమూల గ్రామం లోనిది, మరొకటి రవాణా సౌకర్యం ఉన్నది. ఇంకొకటి పట్టణ వసతులు ఉన్న గ్రామం నుంచి జిల్లాలో ఎంచుకున్నారు.

☞ నమూనాకి తీసుకున్న ఇళ్లల్లో 5-16 ఏళ్ళ వయసు పిల్లలకు వేరువేరుగా ఇచ్చిన పనుల్లో సులభంగా చేయగల వారిని అత్యున్నత విభాగంగా పరిగణించారు.

☞ శాంపిల్‌కి తగిన సమాచారం లేని వివరాల్ని నివేదికలో ప్రచురించలేదు. ప్రీ ప్రైమరీ విభాగంలో ప్రైవేటు స్కూళ్లకు సంబంధించిన పూర్తి సమాచారం అసర్-2024 నివేదికకు అందుబాటులోకి రాలేదు.

☞ ఒకటి, రెండవ తరగతి స్థాయి పాఠ్యాంశాల్ని, కథల్ని చదవటాన్ని 8వ తరగతి వరకు అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించడంలో ఒక కొలబద్దగా సర్వేలో వినియోగించారు.

## ఇండియా అసర్ 2024


# ప్రాథమిక సామర్థ్యాల పెంపుదలే తక్షణ కర్తవ్యం

అసర్ సర్వే ప్రధాన లక్ష్యం, మనం ఇక్కడ ఆ నివేదిక గురించి కొంత వివరంగా ప్రస్తావించుకోవటానికి ప్రధాన కారణమైన 'విద్యా ప్రమాణాల'తో అసర్ 2024 చర్చను ప్రారంభిద్దాం.

అభ్యసన సామర్థ్యాల బేరిజుకు 1-8 తరగతుల పిల్లల్లో నిర్వహించిన పరీక్షల్లో పఠన సామర్థ్యంలో అసర్ ప్రారంభించిన గడిచిన 20 ఏళ్లలో 2024 సంవత్సరమే రికార్డని నివేదిక తెలిపింది. అసర్ పరిమిత ప్రాతిపదికల పరిధిలోనే కొద్దిపాటి మెరుగుదలను నమోదు చేయటం, కొవిడ్ కాలంలో తలెత్తిన ఒడిదుడుకుల్ని అధిగమించటాన్ని విజయంగా అభివర్ణించింది. ప్రభుత్వ పాఠశాలల్లో గణాంకాలు మెరుగవడమే ఇందుకు కారణమని కూడా తెలిపింది. ప్రైవేటు స్కూళ్ల గణాంకాలు ఏమీ తగ్గలేదు. కానీ పెరుగుదల శాతంలో ప్రభుత్వ పాఠశాలల జోరు ఎక్కువగా ఉంది .ఈ విజయం స్థాయిని అలా ఉంచితే, ఇన్నేళ్ల తర్వాత అయినా ఈ మేర విజయం సాధించటానికి చెప్పిన కారణం ఆసక్తికరంగా, ఆశాజనకంగా ఉంది.

**కారుచీకట్లో కాంతిరేఖ ఎన్ఈపీ**

జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 వల్లే స్కూళ్లలో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడ్డాయని నివేదిక రూపకర్తలు సాధికారికంగా విశ్లేషించారు. విద్యా ప్రమాణాలకు పునాది నిర్మాణాన్ని అత్యంత ప్రాధాన్యాంశంగా గుర్తించింది. చదవడం, రాయడం, అంకగణిత సమస్యలను పరిష్కరించడం వంటి ప్రాథమిక సామర్థ్యాలు పిల్లలందరికీ పట్టుబడేలా చేయడం వెనువెంటనే చేయాల్సిన పని అని, ఇది సవ్యంగా జరిగితేనే ఎన్ఈపీ మిగతా అంశాలకు సార్థకత చేకూరుతుందని స్పష్టం చేసింది. యూనియన్ ప్రభుత్వం, పలు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కొవిడ్ తదనంతర కాలం నుంచి ఈ విషయంలో కొంత చురుగ్గానే స్పందించాయి. బాల్యం తొలి దశ నుంచి శ్రద్ధ తీసుకొని బిడ్డ తెలివితేటలని వికసింప చేసేందుకు (ఈసీసీఈ) చర్యలు తీసుకున్నాయి. అవగాహనతో చదవడం, అంకెలు నేర్చుకోవటంలో పట్టు సాధించడం కోసం ప్రారంభించిన 'నిపుణ్ భారత్' కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన ప్రాథమిక సామర్థ్యాల కార్యక్రమం ఎఫ్.ఎల్.ఎన్ ను దాదాపు అన్ని స్కూళ్లకు చేర్చాయి (1-2/3 తరగతులు). ఇందుకు అవసరమైన వనరుని, అంటే, నేర్పించడానికి అవసరమైన



సామగ్రి (టిఎల్ఎం)ని కొనుగోలు చేయటానికి ముందుగానే నిధులను ఇవ్వడంతో పాటు ప్రతి స్కూల్లో కనీసం ఒక టీచర్ ఎఫ్.ఎల్.ఎన్ శిక్షణ పొందేలా చేశారు. శిక్షణ ఎలా ఉండాలో ముందుగానే పాఠశాలలకి మార్గ నిర్దేశకాలు జారీ చేశారు. పునాది స్థాయిలో ఈ ప్రయత్నాల వల్లే అభ్యసన సామర్థ్యాలు మెరుగయ్యాయని నివేదిక రూపకర్తలు అభిప్రాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌ని ఒక ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 2014లో కేవలం 6% మంది మూడో తరగతి పిల్లలే రెండో తరగతి స్థాయి పాఠం చదవగలిగే వారు. 2018 నాటికి ఈ శాతం కేవలం 12.3% కు పెరిగింది. 2024 వచ్చేసరికి ఈ శాతం 27.9 చేరింది. అదేవిధంగా అంకగణిత సామర్థ్యంలో కూడా ఐదో తరగతి స్థాయిలో గత 20 ఏళ్లలోనే రికార్డుగా ఈ ఏడాది యూపీ ఫలితాలు సాధించింది. గతంలో విద్యార్థుల హాజరు 60 శాతం మాత్రమే ఉండగా ఇటీవల నేర్చుకోవాలన్న ఉత్సాహంతో పాఠశాలలకు వచ్చే పిల్లల సంఖ్య 71.4% కి పెరిగింది. కచ్చితంగా ఇందులో యూపీ రాష్ట్ర ప్రభుత్వ కృషి ఉంది. కానీ దేశవ్యాప్తంగా ప్రాథమిక అభ్యసన సామర్థ్యాలపై అత్యంత శ్రద్ధ వహించాలి, అది కూడా వేగంగా జరగాలన్న ఎన్ఈపీ సిఫార్సును యూనియన్ ప్రభుత్వం రాజీ లేకుండా అమలు చేయడం వల్లే ఈ ఫలితం సాధ్యమైంది. జాతీయస్థాయిలో విద్యాపరంగా ఒక బలమైన సంకేతం, సకాలంలో తగినన్ని వనరుల్ని సమకూరుస్తూ చిత్తశుద్ధితో

అమలుకు ప్రయత్నించడం వల్ల యూపీ మాత్రమే కాకుండా చాలా రాష్ట్రాల్లో అభ్యసన సామర్థ్యాల్లో మెరుగుదల ఒక ఒరవడిలా కనిపిస్తుంది. అసర్ సర్వేలు ఎప్పటినుంచో వెలవడుతున్నా, విద్యకు మన సమాజంలో ఎంతో డిమాండ్ ఉన్నా, విద్యా ప్రమాణాల గురించి ప్రభుత్వాలు స్పష్టంగా మాట్లాడడం ఎన్ఈపీ 2020 తోనే స్వతంత్ర భారతదేశంలో మొదలైంది. ఈ విధాన రూపకల్పనకు యూనియన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కస్తూరి రంగన్ కమిటీతో ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ లోతుగా చర్చించి కొన్ని కీలక సూచనలు చేశారు. కమిటీ తన పని ప్రారంభించే సమయంలోనే కాకుండా, నివేదిక తయారీ ప్రక్రియలో, ఆ తర్వాత డ్రాఫ్ట్ పరిశీలనలో జేపీ ఆలోచనలు పంచుకున్నారు. ఎన్ఈపి సంపూర్ణం కాకున్నా, మన దేశం దిశ, దశ మార్చగలిగేదని, అయితే సక్రమంగా అమలు కీలకమని తెలిపారు. ఈ విద్యా విధానం అమలను పూర్తిగా ప్రభుత్వాలకే వదిలేయకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పౌర సమాజం కూడా చురుకైన పాత్ర పోషించాలన్నారు. ఈ క్రమంలోనే పాఠశాల విద్యా ప్రమాణాల పెంపుదలకు ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా టెక్నాలజీ సాయంతో విస్తృత స్థాయి కృషి చేస్తున్నట్లు జేపీ పేర్కొన్నారు. మొత్తంగా ప్రాథమిక అభ్యసన సామర్థ్యాలు, ప్రమాణాల్లో చిన్నపాటి మెరుగుదలకు దోహదం చేసిన ఎన్ఈపీని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలంటే చేయాల్సింది చాలా ఉందని అసర్ 2024 గణాంకాలు సూచిస్తున్నాయి.

అక్షరాలు, పదాలు సులభంగా ఉండే ఒకటి, రెండు తరగతుల పేరాగ్రాఫ్‌లు, రెండవ తరగతి స్థాయి కథ చదవడం– వీటిని టాస్కులుగా 5–16 ఏళ్ల పిల్లలకు సర్వేలో భాగంగా ఇచ్చారు. అదేవిధంగా అంకెల్ని 1 నుంచి తొమ్మిది వరకు, 11 నుంచి 99 వరకు గుర్తు పట్టడం, రెండంకెల తీసివేత (అప్పు తెచ్చుకొని చేసేది), మూడంకెలను ఒక అంకెతో భాగించడం వంటి ప్రాథమిక గణిత సామర్థ్యాలను పరీక్షించారు. ఆ ఫలితాలు....

**చదవటం**

**3వ తరగతి:** రెండో తరగతి పాఠం చదవగలిగే మూడో తరగతి పిల్లల సంఖ్య 2018లో 20.9% ఉండగా, 2022లో 16.3% కి పడిపోయింది. 2024లో 23.4% కి పెరిగింది. ప్రభుత్వ స్కూళ్లలో అసర్ సర్వేల్లో ఇదే రికార్డు. ఈ పెరుగుదల ప్రైవేటు స్కూళ్లలో కంటే ఎక్కువ.

**5వ తరగతి :** ఐదో తరగతి పిల్లల్లో చదివే సామర్థ్యం కొవిడ్ ముందు కాలం స్థాయికి చేరుకుంది. ముఖ్యంగా ప్రభుత్వ స్కూళ్లలో రెండో తరగతి పాఠంలో ఓ పేరా చదవగలిగే ఐదో




తరగతి పిల్లల సంఖ్య 2018లో 44.2% నుండి 2022లో 38.5 శాతానికి పడిపోగా, 2024లో 44.8% కి పెరిగింది.

**8వ తరగతి:** ఎనిమిదవ తరగతిలో కూడా చదివే సామర్థ్యం కొంతమేర పెరిగిందని దేశవ్యాప్త గణాంకాలు సూచిస్తున్నాయి. ఇది 2022లో 66.2% ఉండగా, 2024 లో 67.5% కి పెరిగింది.

**అంకగణితం**

**3వ తరగతి:** కనీస స్థాయి తీసివేత చేయగల పిల్లల సంఖ్య 3వ తరగతిలో దేశవ్యాప్తంగా 2018లో 28.2% ఉంటే, 2022లో 25.9%కి పడిపోయింది. 2024లో 33.07% కి



పెరిగింది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో ఈ సంఖ్య 2018లోని 20.9% నుండి 2024లో 27.6%కి పెరిగింది. ప్రయివేటు స్కూలు పిల్లల్లో ఈ పెరుగుదల స్వల్ప స్థాయిలోనే ఉంది.

**5వ తరగతి :** కనీస భాగహారం చేయగల పిల్లల సంఖ్య 5వ తరగతిలో కూడా మెరుగైంది. 2018లో ఈ సంఖ్య 27.9% ఉంటే, 2022లో 25.6%కి తగ్గి, ఆ తర్వాత 2024లో 30.7%కి పెరిగింది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం మెరుగవటం వల్లే ప్రధానంగా ఈ పెంపు సాధ్యమైంది.

**8వ తరగతి:** 8వ తరగతి విద్యార్థుల్లో ప్రాథమిక అంకగణితం కాస్త అటు ఇటుగా అంతకు ముందు స్థాయిలోనే ఉంది. 2018లో 44% 2022లో 44.7% 2024 లో 45.8% ఉన్నాయి.

### డిజిటల్ అక్షరాస్యత

అసర్ మొట్టమొదటిసారిగా 14-16 ఏళ్ల పిల్లల్లో డిజిటల్ అక్షరాస్యతపై ఇంటింటి సర్వే చేసింది. స్మార్ట్ ఫోన్



అందుబాటు, సొంతంగా ఫోన్ టెక్నాలజీని వినియోగించే సామర్థ్యం మొదలైన వాటిపై వారి నుంచే స్వచ్ఛందంగా కొన్ని ప్రాథమిక వివరాలు సేకరించటంతో పాటు కొన్ని ప్రశ్నలు అడిగారు.

**అందుబాటు:** 14-16 ఏళ్ల పిల్లల్లో దాదాపు అందరికీ స్మార్ట్‌ఫోన్ అందుబాటులో ఉంది. ఇంటిదగ్గర స్మార్ట్‌ఫోన్ ఉందని అమ్మాయిలు, అబ్బాయిల్లో దాదాపు 90% చెప్పారు.

**సొంత ఫోన్:** సొంత స్మార్ట్‌ఫోన్ విషయంలో కొంత లింగ వివక్ష కనిపించింది. బాలురులో 36.2% మందికి సొంతంగా ఫోన్ ఉండగా, బాలికల్లో ఆ సంఖ్య 26.9% మాత్రమే ఉంది.

**వినియోగం:** 82.2% మంది పిల్లలు స్మార్ట్‌ఫోన్ ఎలా ఉపయోగించాలో తెలుసని చెప్పారు (బాలికల్లో 79.4%, బాలురులో 85.5%). వీరిలో 57% మంది విద్యాపరమైన అవసరాలకు వినియోగిస్తున్నామని చెప్పగా, 76% మంది అదే సమయంలో తాము సోషల్ మీడియాకి వినియోగించామని తెలిపారు. సోషల్ మీడియా వినియోగించే పిల్లల్లో ఆన్‌లైన్ లో తమని పరిరక్షించుకునే ప్రాథమిక నైపుణ్యాలు సాపేక్షంగా మెరుగ్గానే ఉన్నాయి. 62% మంది ఒక ప్రొఫైల్ ని ఎలా బ్లాక్ చేయాలి లేదా దానిపై ఎలా ఫిర్యాదు చేయాలో తెలుసన్నారు. ప్రైవేట్ ప్రొఫైల్ ఎలా రూపొందించుకోవాలో 55.2% మందికి తెలుసు, 57.7% మందికి పాస్‌వర్డ్ మార్చుకోవడం పై అవగాహన ఉంది. అమ్మాయిల కంటే అబ్బాయిల్లో ఈ పరిజ్ఞానం ఎక్కువగా ఉంది.

**డిజిటల్ నైపుణ్యాలు:** సర్వే రోజున డిజిటల్ నైపుణ్యాల ప్రదర్శనకు 70.2% మంది బాలురు, 62.2% బాలికలు సొంతవో లేక కుటుంబ సభ్యులు, స్నేహితుల నుంచో స్మార్ట్‌ఫోన్ తెచ్చుకోగలిగారు. స్మార్ట్ ఫోన్ ద్వారా మూడు పనులు చేయాలని సర్వేలో అడిగారు. అలారం సెట్ చేయడం, నిర్దిష్ట సమాచారాన్ని వెతకటం, ఒక యూట్యూబ్ వీడియోను గుర్తించటం, ఆ వీడియోని ఏదో ఒక మెస్సేజింగ్ వేదిక ద్వారా ఎవరో ఒకరికి షేర్ చేయండి అని అడగటమైంది.

➡ మూడొంతులు మంది పిల్లలు ఈ పనుల్ని విజయవంతంగా చేశారు. యూట్యూబ్లో వీడియోను గుర్తించిన వారిలో 90 శాతం మంది షేర్ చేయగలిగారు.

➡ డిజిటల్ నైపుణ్యాల్లో వయసు, లింగభేదాలు కనిపించాయి. కాస్త ఎక్కువ వయసు ఉన్నవారు, బాలికల కంటే బాలురు వీటిని సులువుగా చేయగలిగారు.



### ఎన్‌రోల్‌మెంట్, మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల నిష్పత్తి, ఇతర అంశాలు

➡ కొవిడ్ కాలంలో ప్రభుత్వ స్కూళ్లలో దేశవ్యాప్తంగా విద్యార్థుల నమోదు సంఖ్య పెరిగింది. 2021లో 72.9% కి చేరింది. పలు తక్కువ బడ్జెట్ ప్రైవేటు పాఠశాలల మూసివేత ఇందుకు కారణం. కొవిడ్ ప్రభావం తగ్గాక 2024లో మళ్లీ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య దేశవ్యాప్త స్థాయిలో 66.8% తగ్గింది(కొవిడ్‌కి ముందు 2018 లో 65.5%).

➡ స్కూళ్లలో ఎన్‌రోల్‌కాని పెద్ద పిల్లల (15-16 ఏళ్లు) సంఖ్య ఇటీవల సంవత్సరాలలో స్థిరంగా తగ్గుతోంది. ఈ సంఖ్య 2018లోని 13.1% నుంచి 2022లో 7.5% కి భారీగా తగ్గగా, 2024 లో కూడా 7.9% వద్ద ఉంది. అమ్మాయిలు, అబ్బాయిలు కలిపి ఈ శాతం సుమారు 7% ఉండవచ్చని అంచనా.

➡ స్కూళ్లలో ఎన్‌రోల్ అవుతున్న పిల్లల సంఖ్య 20 ఏళ్లుగా 90శాతం దాకా ఉండగా 2022లో 98%, 2024 లో







98.1% గా ఉంది.

➡ ఎన్‌రోల్‌మెంట్‌లో సమస్య లేనట్లే, ఉపాధ్యాయుల సంఖ్య విషయంలో కూడా పెద్ద సమస్య కనిపించలేదు. మధ్యాహ్న భోజనం, టాయిలెట్లు, తాగునీటి సదుపాయం, గ్రంథాలయాలు వంటి సదుపాయాలు ఉన్న కొద్దీ మెరుగవుతున్నాయి. బాలికల మరుగుదొడ్లు 2022లో 68.4% పాఠశాలల్లో ఉండగా 2021 నాటికి ఈ సంఖ్య 72% పెరిగింది. తాగునీటి సౌకర్యం 76% నుండి 77 శాతానికి, పాఠ్య పుస్తకాలు కాకుండా ఇతర పుస్తకాలను కూడా ఉపయోగించే స్కూళ్ల సంఖ్య 36.9 నుంచి 43.9% పెరిగింది.

➡ ప్రాథమిక అభ్యసన సామర్థ్యాలలో ఈసారి గణాంకాల మెరుగుదలకు ప్రభుత్వ పాఠశాలలు కారణమైనా, ఫలితాల్లో ప్రైవేటుబడుల ఆధిపత్యం తగ్గలేదు. అంతరం మాత్రమే తగ్గింది. ఉదాహరణకు రెండో తరగతి స్థాయి పాఠం చదవగల మూడో తరగతి పిల్లలు ప్రభుత్వ స్కూళ్లలో 2018లో 20.9% ఉండగా, ప్రైవేట్ లో 40.6% ఉన్నారు. కొవిడ్ ఉధృతి సమయంలో ప్రైవేటు స్కూళ్లలో ప్రమాణాలు తగ్గినా ప్రభుత్వంలో కంటే రెట్టింపుగానే ఉన్నాయి. రెండో తరగతి పాఠం చదవగల మూడో క్లాస్ విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ పాఠశాలల్లో 2022లోని 16.3 నుంచి 2024లో 23.4% కి పెరగకగా, ప్రైవేట్ లో ఈ పెరుగుదల 33.1% నుంచి 35.5% మాత్రమే ఉంది. కొవిడ్ ముందు కాలం కంటే కూడా ప్రైవేటు స్కూళ్లు తక్కువ వృద్ధిని నమోదు చేయడం వల్ల ప్రభుత్వ స్కూళ్లలో అంతరం 20% నుంచి 12 శాతం పాయింట్లకు తగ్గింది.

సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ స్కూళ్ల కంటే కొన్నేళ్లుగా ప్రైవేటు పాఠశాలలు మెరుగ్గా ఉంటున్నాయి. కానీ ఈసారి అంకగణితంలో కూడా ప్రైవేటు కంటే ఎక్కువ శాతం వృద్ధిని ప్రభుత్వ బడులు సాధించాయి. రెండు రంగాల స్కూళ్లూ గత పదేళ్లలో రికార్డు గణాంకాల్ని నమోదు చేసినా, ప్రభుత్వ రంగ విద్యాసంస్థలు ఎక్కువ వృద్ధి శాతం నమోదు చేశాయి. ఒక తీసివేత చేయగల మూడో తరగతి పిల్లల సంఖ్యలో 2022, 2024 మధ్య ప్రభుత్వ స్కూళ్లు 36.6 వృద్ధితో 20.22% నుంచి 27.6% కి పెరిగాయి. ప్రైవేట్‌లో ఈ వృద్ధి శాతం 10.2 మాత్రమే ఉంది.

➡ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మధ్య విద్యా ప్రమాణాల్లో మరీ ఎక్కువ అంతరం లేకపోయినా, కాస్త మెరుగ్గా ఉండటంతో బాలురను ప్రైవేటులో, బాలికలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్చే వివక్ష కొనసాగుతోంది. అదే విధంగా పాఠశాలల్లో చేరని బాలికల సంఖ్య కొన్ని రాష్ట్రాల్లో ఎక్కువగా ఉంది. మధ్యప్రదేశ్‌లో 16.5%, ఉత్తరప్రదేశ్‌లో 15%, రాజస్థాన్లో 12.7%, మిజోరంలో 12.3%, గుజరాత్ లో 10.5% మంది అమ్మాయిలు స్కూల్‌కి వెళ్ళడం లేదు. ఈ రకంగా రాష్ట్రాల మధ్య అంతరం మిగిలిన కొన్ని గణాంకాల్లో కూడా కనిపిస్తుంది. కాస్త మెరుగ్గా ఉన్న హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు కొవిడ్ నష్టం నుంచి 2024 నాటికి వేగంగా కోలుకున్నాయి.

**బోధనా పద్ధతుల్లో మెరుగుదల**

➡ తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధించేటప్పుడు వివిధ



సందర్భాల్లో అసర్ సర్వేయర్లు ఫోటోలు తీశారు. వివరాల నమోదుతో పాటు ఆ ఫోటోలో విశ్లేషణని కూడా బేరీజుకి

పరిగణలోకి తీసుకున్నారు.

➡ సిలబస్ పూర్తి చేయాలని హడావుడి పడటం, ఆధునిక బోధనా పరికరాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోలేకపోవడం, రికార్డుల తయారీ భారం ఎక్కువైందనటం, పిల్లలపై దండోపాయం ప్రయోగించడం వంటి సమస్యలున్నా.. మొత్తంగా టీచర్ల బోధనా దృక్పథంలో మార్పు ఈసారి గణనీయంగా కనిపించింది.

➡ పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడటం, వారి మధ్యే కూర్చుని వారిలోనే కొందరితో పాఠాలు చెప్పించడం, నాలుగు ఐదు తరగతుల్లో కాస్త మందకొడిగా ఉన్న వారిని రెండు మూడు క్లాసుల వారితో కలిపి కూర్చోబెట్టి సామర్థ్యాన్ని పెంచటం, పాఠ్య పుస్తకంలో ఉన్నదే చెప్పటం కాకుండా స్థానిక ఉదాహరణలతో సందర్భోచితంగా విషయాలను వివరించటం, ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చిన వారినీ తరతరమ భేదం లేకుండా ప్రోత్సహించటం వంటి సానుకూల ధోరణులు స్నేప్‌షాట్ల విశ్లేషణలో కనిపించాయి.

➡ 75 శాతానికి పైగా స్కూళ్లు ఒకటో తరగతిలోకి ప్రవేశించే విద్యార్థులకు స్కూలు సంసిద్ధత కార్యక్రమం 2023 నుంచి అమలు చేస్తున్నట్లు చెప్పాయి.

➡ 95% కంటే ఎక్కువ స్కూళ్లు పాఠ్యపుస్తకాలు అన్ని తరగతుల పిల్లలకు సకాలంలో అందుబాటులోకి వచ్చేలా చేశాయి. 2022తో పోలిస్తే ఇది గణనీయ మెరుగుదల.

➡ 3-8 సంవత్సరాల వయసు పిల్లల తల్లిదండ్రుల్లో స్కూలు స్థాయి చదువు కూడా లేనివారు తల్లుల్లో 43%, తండ్రుల్లో 25% ఉండగా, 2024 నాటికి ఆ సంఖ్యలు 24,16 కి తగ్గాయి. ఇంట్లో మానవ వనరుల సామర్థ్యం పెరగడం కూడా బోధనా ప్రమాణాల స్థాయిని పెంచింది.

**ప్రీ స్కూల్/ ప్రీ- ప్రైమరీ ఎన్‌రోల్‌మెంట్, చదువు**

చిన్నప్పటి నుంచే ప్రతి బిడ్డకు చదువు అందించే ప్రయత్నం మొదలవ్వాలని, మొక్కుబడిగా కాకుండా బేరీజు వేసే స్థాయిలో వారికి విషయాన్ని పరిచయం చేయాలని ఎన్ఈపీ సిఫార్సు చేసింది.

➡ ఇండియాలో పూర్వ పాఠశాల/ పూర్వ ప్రాథమిక ఎన్‌రోల్‌మెంట్ అత్యధికంగా ఉందని, పెరుగుతోందని అసర్ 2024 తెలిపింది.

➡ 3-4 ఏళ్ల పిల్లల్లో 80% పైగా ఏదోక ప్రీ ప్రైమరీ సంస్థలో చేరారు.



➡ పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో మూడేళ్లు, ఇంకా లోపు చిన్నారుల చేరికలు 2022-24 మధ్యకాలంలో 75.8 నుంచి 77.4% కి చేరాయి. గుజరాత్, మహారాష్ట్ర ఒడిషా ఈ విభాగంలో దాదాపు నూరు శాతానికి చేరాయి.

➡ నాలుగు ఏళ్ల చిన్నారుల చేరికలు 82% నుండి 83.3% కు పెరిగాయి. ఐదేళ్ల వయసు పిల్లలు చేరటం 62.2% నుండి 71.4% కి పెరిగింది.

➡ 3-4 ఏళ్ల పిల్లల్లో సగం మందికి పైగా అంగన్‌వాడీల్లోనే చేరుతున్నారు. ఈ సంఖ్య 2018, 2024 మధ్య 57 నుంచి 67 శాతానికి పెరిగింది.

➡ నాలుగేళ్ల వయసున్న వారిలో 60 శాతం మంది అంగన్‌వాడీల్లో చదువుతున్నారు. వీరికి ఆరోగ్యం, పౌష్టికాహారం, టీకాలు మొదలైనవి అందిస్తున్నారు.

➡ ఐదో సంవత్సరం నుంచి అంగన్‌వాడీలలో పిల్లల సంఖ్య తగ్గుతోంది. ప్రైవేటు స్కూళ్లలో ఎల్‌కేజీ, యూకేజీ కోసం ప్రయత్నాలు మొదలు పెడుతున్నారు.

➡ ఒకటో తరగతిలో చేరుతున్న ఐదేళ్ల లోపు పిల్లల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ఇలాంటి వారి సంఖ్య 2018లో 25.6% ఉండగా 2024 కి 16.7% కి పరిమితమైంది.

➡ పూర్వ ప్రాథమిక విద్య కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేకించి ఉపాధ్యాయులు లేరు. ఈ విభాగంలో ప్రైవేటు రంగ సమాచారం సమగ్రంగా అందుబాటులో లేదు. మొత్తంగా ప్రీస్కూల్, ప్రీ ప్రైమరీ మధ్య సరైన అనుసంధానం ఉండటం, మూడో తరగతికి వచ్చేసరికి పిల్లల్లో ఆయా అంశాల్లో సామర్థ్యం బలోపేతం అవటం, ఈ ప్రయత్నాన్ని కొనసాగించటం, పటిష్ట పరచడం అవసరమని నివేదిక సూచించింది.

➡ ఈ విధంగా పూర్తిస్థాయిలో అక్షర, అంకెల పరిజ్ఞానం అందించాల్సిన పిల్లలు ఈవేళ ఇండియాలో 10 కోట్ల మంది దాకా ఉన్నారని అంచనా.

| పఠన స్థాయి స్కూలు వారీగా : భారతదేశ (గ్రామీణ) 2014-2024 | | | | | | |
|---|---|---|---|---|---|---|
| సంవత్సరం | 3వ తరగతి : 2 క్లాస్ పాఠం చదవగలిగే పిల్లలు % | | | 5వ తరగతి : 2వ తరగతి పాఠం చదవగలిగే పిల్లలు % | | |
| | ప్రభుత్వ | ప్రయివేటు | మొత్తం | ప్రభుత్వ | ప్రయివేటు | మొత్తం |
| 2014 | 17.2 | 37.8 | 23.6 | 42.2 | 62.6 | 48.0 |
| 2016 | 19.3 | 38.0 | 25.2 | 41.7 | 63.0 | 47.9 |
| 2018 | 20.9 | 40.6 | 27.3 | 44.2 | 65.1 | 50.5 |
| 2022 | 16.3 | 33.1 | 20.5 | 38.5 | 56.8 | 42.8 |
| 2024 | 23.4 | 33.5 | 27.1 | 44.8 | 59.3 | 48.8 |

| అంకగణిత సామర్థ్యం స్కూలు వారీగా : భారతదేశ (గ్రామీణ) 2014-2024 | | | | | | |
|---|---|---|---|---|---|---|
| సంవత్సరం | 3వ తరగతి : కనీసం తీసివేత చేయగలిగే పిల్లలు % | | | 5వ తరగతి : భాగహారం చేయగలిగే పిల్లలు % | | |
| | ప్రభుత్వ | ప్రయివేటు | మొత్తం | ప్రభుత్వ | ప్రయివేటు | మొత్తం |
| 2014 | 17.2 | 43.4 | 25.4 | 20.7 | 39.3 | 26.1 |
| 2016 | 20.3 | 44.1 | 27.7 | 21.1 | 38.0 | 26.0 |
| 2018 | 20.9 | 43.5 | 28.2 | 22.7 | 39.8 | 27.9 |
| 2022 | 20.2 | 43.1 | 25.9 | 21.6 | 38.7 | 25.6 |
| 2024 | 27.6 | 47.5 | 33.7 | 26.5 | 41.8 | 30.7 |






పశ్చిమగోదావరి జిల్లా దూబచర్లలో నిర్వహించిన అసర్– 2024 వలంటీర్లు శిక్షణ కార్యక్రమం, ఘంటావారిగూడెం, గొల్లగూడెం, ముసుళ్లకుంట, పుల్లలపాడు గ్రామాల్లో నిర్వహించిన పైలెట్ సర్వే, సర్వే పత్రాల నాణ్యత చెకింగ్ కార్యక్రమాల్లో పాల్గొన్న జనబలం వర్కింగ్ ఎడిటర్ డి. సోమసుందర్. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న డైట్ ప్రిన్సిపాల్ ఎం. కమలకుమారి, మాస్టర్‌ట్రైనర్లు, వలంటీర్లు తదితరులు.

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

ప్రతీ ఓటరూ తనలోకూడా ఎంతో కొంత అవినీతి ఉందని గ్రహించినరోజున, మెరుగైనసమాజం తప్పకుండా ఏర్పడుతుంది!

## Vote Jugaad February 2025 జుగాడ్ 50:50 రాజనీతి

## (Good Governance by Jugaad Bharat United Voters)

**ఆచరణయోగ్యమైన స్వజాతీయ నమూనా మార్పు అనే సిద్ధాంతం ఓటర్ల జాతికి అంకితం**

**కష్టపడి పనిచేద్దామనే నిజాయితీ కలిగిన నిరుద్యోగులకు చక్కని అవకాశం**

**ప్రతిపాదన జుగాడ్ ఓటర్లది. అదృష్టం భారతీయులందరిదీ.**

ఓటర్లే తమ కష్టార్జితమైన డబ్బుతో అవినీతిలేని-పార్టీ నిర్మించుకుని క్రమశిక్షణతో అత్యంత పారదర్శకంగా నిర్వహించుకోవాలి. పదవులకోసం కీచులాడుకోకూడదు. చట్టబద్ధపాలన, అధికార-వికేంద్రీకరణ, ఆర్థిక-వికేంద్రీకరణ పార్టీలోనే జరిగితీరాలి. ఓటర్లలో పాలకవర్గం, పాలితవర్గం అని రెండేరెండు సమూహాలున్నాయి! దేశంలోని వందకోట్లమంది ఓటర్లనూ శాసిస్తున్నది మనచేత ఎన్నుకోబడిన షుమారు 4000మంది MLAలు మరియు, 1000 మంది MPలు మాత్రమే. మూడవ సమూహం మనదైనందిన జీవితంలో ముప్పుతిప్పలు పెట్టడానికి నియమితులైన శాశ్వతప్రభుత్వ ఉద్యోగస్తులే! ఒక్క కేంద్ర ప్రభుత్వంలోనే 48.67 లక్షలమంది కష్టపడి పనిచేస్తున్న వారుండగా, 67.95 లక్షలమంది విశ్రాంత-ఉద్యోగస్తులు ఒక్కొక్కరూ ఏడాదికి సగటున పదిలక్షల రూపాయల వరకు "ఆదాయపు-పన్ను రహిత" పెన్షన్ సంపాదిస్తున్నారు. వీరందరూ భారతభాగ్యవిధాతలుగా ఈ ఉద్యమానికి ఒకేఒకసారి 10,000 రూపాయిలు విరాళమిచ్చి తాము కూడా భారతీయులేనని సగర్వంగా ప్రకటించుకోమని మా ప్రార్థన!

25 నుండి 60 సంవత్సరముల వయస్సు కలిగిన యువతీ-యువకులందరికీ "ప్రతిపాదిత జుగాడ్ ద్విపక్ష పార్టీ ఓటర్లు"గా ఇదే మా ఆహ్వానం! Co operation based on trust (నమ్మకంపైఆధారపడిన పరస్పర సహకారం) అనే ధ్యేయంతో సంఘటితంగా మీ పిల్లల భవిష్యత్తు కోసం ఒక ప్రయత్నం చేద్దాం రండి

**జుగాడ్ భావి భారత భాగ్య విధాతలు :** (Rs/-10,000 donors)

**Sarvasri: (1) M.PARTHASARATHY (2) K.SUBRAHMANYAM (3) Col.P.V.RAMANA RAO (4) U.SUBBA RAO (5) Prof.C.K.MURTHY (6) SYED ANSARI (7) Smt. D.KASTURI (8) K.SRINIVAS MURTHY (Rajahmundry AP) (9) Dr. VAMSI RAJ (Kakinada AP) (10) Dr.G.ABBAIAH (Kakinada AP)**

**జుగాడ్ ఓటర్లు : Sarvasri (11) JVL. NARAYANA (Nellore AP) (12) S.D.BABU (Tamilnadu) (13) T.SURYANARAYANA (Vizag AP) (14)Smt.D. SUBHADRA (15) M.RANGA RAO (16) M.SAI SUBBARAO (17) Smt.D.JANAKI (18) J.VENKATA RAO (Vijayawada AP) (19) P.NARASIMHA RAO (20) SAI SURYANARAYANA (Karnataka) (21) MSS KUMAR (22) Dr.U.V.KRISHNA MURTHY (23) M.RAMA RAO (24) NANDAN SRIDHAR (25) Smt.K.RAJESWARI (26) Smt.K.LAKSHMI (27) Justice CHANDRAKUMAR (28) K. VASUDEVA RAO (29) NARAGONI (30) D.KONDALA RAO (31) M.S. Narayana Rao (32) Sriram (Amalapuram AP) (33) P.Sunil (Bhimavaram AP) (34) Amaranath (35) B.Poorna Kumar Das 36) KHS Sarma 37) Metta Ramarao (Vizag, AP) 38) IR Rao 39) S Madhavarao 40) DRK Rao 41) Smt.P Amulya 42) pallela Devaraju 43) YSN MURTY (Kakinada, AP) 44) DV KOTESWARA RAO 45) Santosh M.Tech**

**Contact: Jugaad Parthasarathy (9866416798) with (1) MLA Constituency name (2) your name and gender (3) your age (4) your. Cell No:**

advt

# చదవటంలో 27- లెక్కల్లో 13
# తెలంగాణ అసర్ 2024

తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదివే విద్యార్థుల్లో దాదాపు సగం మంది రెండో తరగతి తెలుగు పాఠాన్ని తప్పులు లేకుండా చదవ లేకపోయారని అసర్–2024 పేర్కొంది. ప్రైవేటు పాఠశాల ల్లోని పిల్లల పరిస్థితి స్వల్పంగానే మెరుగ్గా ఉందని తెలిపింది.

➡ మాతృభాషలో పాఠాల్ని తప్పులు లేకుండా చదవడంలో రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లోని ఎనిమిదో తరగతి విద్యార్థులు దేశంలోని 27 రాష్ట్రాల్లో చివరి స్థానంలో ఉన్నారు. మూడు, ఐదు తరగతులకు సంబంధించి 24వ స్థానంలో ఉన్నారు.

➡ ఒకటో తరగతిలో అక్షరాలు కూడా చదవలేని వారు 30.8% ఉండగా, కేవలం పదాలు చదవగలిగిన వారు 21.9%, పాఠ్యపుస్తకంలో 'మంకెన పూలు ఎరుపు' వంటి వాక్యాలు చదవగలిగిన వారు 4.2% ఉన్నారు.

➡ రెండో తరగతిలో కనీసం అక్షరాలు చదవలేని వారు 13.2 శాతం ఉండగా, కేవలం అక్షరాలు చదవగలిగిన వారు 37.9%, పదాలు మాత్రమే చదవగలిగిన వారు 36.0%, ఒకటో తరగతి వాక్యాలు చదవగలిగిన వారు 10.4% ఉన్నారు.

➡ మూడో తరగతిలో అక్షరాలు కూడా చదవలేని వారు 7.8% ఉంటే, 2వ తరగతి పాఠం చదవగలిగిన వారు 6.2 శాతం, ఒకటో తరగతి వాక్యాలు చదవగలిగిన వారు 18.3% ఉన్నారు.

➡ ఐదో క్లాసులో కేవలం అక్షరాలు చదవగలిగిన వారు 11.6%, రెండో తరగతి పాఠం చదవగలిగిన వారు 31.6% ఉన్నారు.

➡ మూడో తరగతి విద్యార్థుల్లో 29.1% మంది తీసివేతలు సరిగా చేయగలిగారు. 5వ తరగతి విద్యార్థుల్లో 23.9% సక్రమంగా చేయగలిగారు. ఈ సామర్థ్యంలో తెలంగాణ దేశంలో 13వ స్థానంలో ఉంది.

➡ ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో 38.5% మంది భాగహారాలు సరిగా చేశారు. ఈ విషయంలో జాతీయ స్థాయిలో రాష్ట్రం 12వ స్థానంలో ఉంది.

➡ చదవటంలోనే రాష్ట్రంలోని పిల్లల పరిస్థితి దేశంలో అట్టడుగు స్థాయిలో ఉంటే రాయడంలో మరీ ఘోరంగా ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రాథమిక విద్యలో చదవడం రాయడంపైనే ప్రధానంగా చదువు ఆధారపడి ఉంటుందని, ఈ విషయంలో వెనుకబడు తున్నారంటే అది పిల్లలు తప్పు కాదని, టీచర్లదే బాధ్యతని చెబుతున్నారు.

➡ బాలికలనే ఎక్కువగా ప్రభుత్వ స్కూల్లో చేరుస్తున్నారు. ప్రీ–స్కూల్ స్థాయిలో అంగన్ వాడీల్లో 2024లో 3ఏళ్ల పిల్లలు 81.4%, నాలుగేళ్ల వయసు వారు 48.9%, ఐదేళ్ల పిల్లలు 21.7% ఉన్నారు. ప్రీ- ప్రైమరీ స్థాయిలో (ఐదేళ్ల వయసు) ప్రభుత్వ స్కూళ్లలో 17.9% ఉండగా, ప్రైవేట్ లో 48% ఉన్నారు. ప్రైవేట్ లో (ఎల్‌కేజీ /యూకేజీ) ఈ సంఖ్య 2022 కంటే 11% ఎక్కువ.

➡ తెలంగాణలో 270 గ్రామాల్లో 5,306 ఇళ్లకు వెళ్లి మూడు నుంచి 16 సంవత్సరాల వయసున్న పిల్లల స్కూల్ ఎన్‌రోల్‌మెంట్, అభ్యసన సామర్థ్యాలు, 14 –16 ఏళ్ల వయసు వారిలో డిజిటల్ అక్షరాస్యతను అసర్ 2024 సర్వే చేసింది. అభ్యసన సామర్థ్యాలపరంగా పిల్లలు వెనుకబడినట్లు తెలిపింది. 9.6% విద్యార్థులు ఇళ్లల్లో స్మార్ట్‌ఫోన్ ఉందని, వారిలో 74.70 శాతం మంది వాటిని బడులకు తెచ్చుకునే పరిస్థితిలో ఉన్నారని తెలిపింది.

**తెలంగాణ సర్వేలోని ఇతర ముఖ్య అంశాలు**

➡ విద్యార్థుల హాజరు 2022 సర్వేలో 75.5% ఉండగా, తాజాగా 73.5%కి తగ్గింది. టీచర్ల హాజరు గత సర్వే మాదిరిగానే 85.5% గా ఉంది.

➡ 62% పాఠశాలల్లో ఒకటో తరగతి పిల్లలు ఇతర తరగతుల వారితో కూర్చుని చదువుకుంటున్నారు. 61.98% పాఠశాలలో రెండో తరగతి పిల్లలదీ ఇదే పరిస్థితి.

➡ 60, అంతకంటే తక్కువ పిల్లలు ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల శాతం భారీగా పెరుగుతుంది. 2010 లో ఇలాంటి స్కూళ్లు 17.2% ఉండగా 2024లో 45.2 శాతానికి చేరడం ఆందోళనకరం.

➡ 53.2% పాఠశాలల్లో తాగునీరు అందుబాటులో ఉంది.

➡ 5.4% స్కూళ్లలో శౌచాలయాలు లేవు. 18.9% పాఠశాలల్లో ఉన్నా వినియోగంలో లేవు.

असर ASER 2024 RURAL
Facilitated by PRATHAM



| 2వ తరగతి పాఠం సరిగా చదివిన 8వ తరగతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల % | | |
|---|---|---|
| సంవత్సరం | జాతీయ సగటు | తెలంగాణ సగటు |
| 2014 | 71.50 | 73.90 |
| 2016 | 70.00 | 71.70 |
| 2018 | 69.00 | 63.10 |
| 2022 | 66.20 | 58.10 |
| 2024 | 67.50 | 50.80 |

| 2వ తరగతి తెలుగు పాఠం సరిగా చదివిన 5వ తరగతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల % | | | | |
|---|---|---|---|---|
| | జాతీయ సగటు | | రాష్ట్ర సగటు | |
| సంవత్సరం | ప్రభుత్వ | ప్రయివేటు | ప్రభుత్వ | ప్రయివేటు |
| 2014 | 42.20 | 62.60 | 53.70 | 55.70 |
| 2016 | 41.70 | 63.00 | 40.00 | ---- |
| 2018 | 44.20 | 65.10 | 41.30 | ---- |
| 2022 | 38.50 | 56.80 | 31.60 | 39.20 |
| 2024 | 44.80 | 59.30 | 29.30 | 35.60 |

| భాగహారాలు సరిగా చేసిన వారు % | | | |
|---|---|---|---|
| | 5వ తరగతి | | 8వ తరగతి |
| సంవత్సరం | ప్రభుత్వ | ప్రయివేటు | ప్రభుత్వ |
| 2014 | 29.50 | 39.70 | 43.70 |
| 2016 | 26.00 | ---- | 51.40 |
| 2018 | 26.70 | ---- | 43.00 |
| 2022 | 21.50 | 26.40 | 40.20 |
| 2024 | 23.90 | 27.50 | 38.50 |

# ఏపీ అసర్ 2024

# ప్రాథమిక విద్యలోనూ సంక్షోభం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి స్థాయి తెలుగు పాఠాన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో 47 శాతం మంది తప్పులు లేకుండా చదవలేకపోయారు. 2014లో ఇలాంటి స్థాయి విద్యార్థులు 20.5% మంది ఉండగా, ఇప్పుడు రెండింతలకు పైగా పెరిగింది. సెప్టెంబర్ 2024 నుంచి అసర్ చేసిన తాజా సర్వేలో 8వ తరగతి పిల్లలకి ఇచ్చిన టాస్క్ 'రఘు నిద్రలేచేసరికి వెలుగు కనబడింది. అతను వెలుగు వస్తున్న వైపు వెళ్లాడు' వంటి సరళ పదాలతో కూడినది.

ఏపీలో ఉమ్మడి 13 జిల్లాల ప్రాతిపదికన 390 గ్రామాల్లో 7721 కుటుంబాలలో 3- 16 వయసు పిల్లలను సర్వే చేశారు. 352 ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ప్రధానంగా మూడు, ఐదు, ఎనిమిది తరగతుల అభ్యసన సామర్థ్యాలను నివేదికలో ప్రస్తావించారు. మాతృభాషలో అక్షరాలు, పదాలు ఒకటి, రెండో తరగతి స్థాయి పాఠాలు, గణిత అంకెలు, తీసివేతలు, భాగహారాలు ఇచ్చి విద్యార్థుల సామర్థ్యాలను గణించారు.

⏭ రెండో తరగతి తెలుగు పాఠాన్ని ఐదో తరగతి విద్యార్థుల్లో 62.5% మంది చదవలేక పోయారు. మూడో తరగతిలో 85.3% మందికి చదవడమే రాలేదు.

⏭ ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలోని ఎనిమిదో తరగతి పిల్లల్లో 89.3% మంది 'వేల, బండి, గౌరి' వంటి పదాల్ని చదివేందుకు తడబడ్డారు. 75.4% మంది ఒకటో తరగతి స్థాయి పాఠాన్ని, 43.8% మంది రెండో తరగతిలోని పాఠాన్ని చదవలేకపోయారు.

⏭ తెలుగు అక్షరాల్లో 'గ, క, ఔ, ఐ' లను ఎనిమిదో తరగతి పిల్లలలో 2.2% మంది గుర్తించలేదు. ఇవే అక్షరాలను ఒకటో తరగతిలో 22.5%, రెండులో 9.6%, మూడులో 5.9%, నాలుగులో 4%, ఐదులో 2.3%, ఆరులో 1.9%, ఏడవ తరగతిలో 2.2% మంది చదవ లేదు.

⏭ ఒకటో తరగతిలో 18.9% మంది కనీసం ఒకటి నుంచి తొమ్మిది అంకెల్ని గుర్తించలేకపోయారు. కేవలం 39.7% మంది 11-99 అంకెలను గుర్తించగలిగారు.



⏭ మూడో తరగతిలో 4.8% పిల్లలు 1-9 అంకెల్ని కనీసం గుర్తించలేకపోయారు. 11% మంది 9 వరకు అంకెల్ని గుర్తించగలిగినా, 11-99, ఆపైన గుర్తించలేకపోయారు. 31.2% మంది తీసివేత చేయగలిగారు గానీ, భాగాహారం చేయలేకపోయారు. 41-13, 53-24, 58-37 వంటివి చేయగలిగారు, కానీ 928ని ఏడుతో భాగించటం, 519ని 4తో భాగించటం వంటివి చేయలేకపోయారు. 12.9% పిల్లలు మాత్రమే భాగహారం చేయగలిగారు.

⏭ ఐదో తరగతిలో 35.5% మంది మాత్రమే తీసివేతలు చేయగలిగారు. భాగాహారాలు 36.2% చేయగలిగారు.

⏭ ఎనిమిదో తరగతిలో 2.3% కనీసం 9 వరకు అంకెల్ని గుర్తించలేకపోగా, తీసివేతలు తప్ప భాగహారం చేయలేని వారు 30.9 శాతం, భాగాహారం చేయగలిగిన వారు 48.4 శాతం విద్యార్థులు ఉన్నారు.

⏭ మూడేళ్ల వయసు పిల్లల్లో 86.8%, నాలుగేళ్ల వారిలో 64.6%, ఐదేళ్ల వయసు పిల్లల్లో 29.3% మంది అంగన్‌వాడీల్లో ఉన్నారు. ప్రైవేటు ఎల్‌కేజీ, యూకేజీల్లో ఐదేళ్ల వయసు పిల్లల సంఖ్య 2022లో 36.5% నుంచి 2024లో 46.6శాతానికి పెరిగింది.

**ఏపీ అసర్‌లోని ఇతర ముఖ్యాంశాలు:**

⏭ 14-16 విద్యార్థుల్లో ఎక్కువమంది సామాజిక

మాధ్యమాలకే సమయం కేటాయిస్తున్నారు.

⏭ 14 ఏళ్ల పిల్లల్లో 81.4%, 15 ఏళ్ల వారిలో 82.2%, 16 వయసు వారిలో 84.4% మంది సోషల్ మీడియా కోసం ఫోన్ వినియోగిస్తున్నారు. ఈ వయసు పిల్లలు ఉన్న ఇళ్లల్లో సుమారు 92% కుటుంబాలకు స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి.

⏭ సుమారు 42% పిల్లలకు సొంతంగా స్మార్ట్ ఫోన్లు ఉన్నాయి. వాటిలో అలారం సెట్టింగ్, బ్రౌజింగ్, యూట్యూబ్ వీడియోలు గుర్తించడంలో 80 శాతానికి పైగా విద్యార్థులకు అవగాహన ఉంది.

⏭ రాష్ట్రంలో 70.8% ప్రభుత్వ పాఠశాలల్లో 60 మంది లోపే విద్యార్థులు ఉన్నారు. 55.9% బడుల్లో తాగునీటి సదుపాయం ఉండగా, 26.2% బడుల్లో సదుపాయం ఉన్నా తాగునీరు లేదు. 78.4% బడుల్లో శౌచాలయాలు వాడుకలో ఉన్నాయి. 77.2% బడుల్లో బాలికలకు ప్రత్యేకంగా మరుగు దొడ్లు ఉండగా, 9.8% స్కూళ్లలో వినియోగంలో లేవు.

⏭ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కలిపి చూస్తే అబ్బాయిల కంటే అమ్మాయిలు మెరుగ్గా ఉన్నారు.

⏭ ఆట స్థలాలు ఉన్న స్కూళ్లు 2018లో 61% నుండి 2024లో 86.2 శాతానికి పెరిగాయి. క్రీడా సామగ్రి అందుబాటులో ఉన్న పాఠశాలలు 2018లో 79% నుండి 2024లో 90.7% కు పెరిగాయి. అక్షరాన్ని, అంకెల్ని పరిచయం చేసే ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమాలకు 75.9% ప్రాథమిక పాఠశాలలు (1–2/3 తరగతులు) మార్గనిర్దేశకాలు అందుకున్నాయి.

❖

**3వ తరగతిలో అంకగణిత సామర్థ్యం తీరు.. స్కూల్ వారీగా**

| సంవత్సరం | కనీసం ఒక తీసివేత చేయగల పిల్లల% | | |
|---|---|---|---|
| | ప్రభుత్వ | ప్రయివేటు | మొత్తం |
| 2014 | 31.4 | 57.8 | 39.8 |
| 2016 | 39.1 | 62.9 | 48.3 |
| 2018 | 34.1 | 45.6 | 38.5 |
| 2022 | 29.2 | 42.9 | 33.6 |
| 2024 | 40.9 | 48.7 | 44.0 |

**5వ తరగతిలో అంకగణితం స్థాయి .. స్కూలు వారీగా**


| సంవత్సరం | భాగహారం చేయగల పిల్లల % | | |
|---|---|---|---|
| | ప్రభుత్వ | ప్రయివేటు | మొత్తం |
| 2014 | 37.8 | 37.3 | 37.6 |
| 2016 | 35.9 | 40.3 | 37.4 |
| 2018 | 36.7 | 45.3 | 39.7 |
| 2022 | 27.3 | 36.4 | 29.7 |
| 2024 | 35.1 | 38.5 | 36.2 |

# ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసన సామర్థ్యాలు జిల్లాల వారీగా-2024

| జిల్లా పేరు | 3-5 తరగతులు : అభ్యసన స్థాయిలు | | 6-8 తరగతులు : అభ్యసన స్థాయిలు | |
|---|---|---|---|---|
| | 2వ క్లాసు స్థాయి పాఠం చదవగలిగే పిల్లల% | కనీసం తీసివేత చేయగల పిల్లల% | 2వ క్లాసు స్థాయి పాఠం చదవగలిగే పిల్లల% | భాగహారం చేయగల పిల్లల% |
| అనంతపురం | 34.8 | 59.5 | 52.5 | 49.8 |
| చిత్తూరు | 24.1 | 44.5 | 41.0 | 36.0 |
| తూర్పుగోదావరి | 24.6 | 65.6 | 51.3 | 42.5 |
| గుంటూరు | 23.7 | 64.3 | 54.8 | 56.0 |
| కృష్ణా | 25.6 | 60.3 | 48.7 | 40.1 |
| కర్నూలు | 19.9 | 45.1 | 38.8 | 35.3 |
| ప్రకాశం | 24.1 | 53.3 | 48.0 | 31.6 |
| శ్రీకాకుళం | 43.1 | 81.7 | 63.7 | 70.7 |
| శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు | 27.4 | 52.0 | 47.7 | 33.9 |
| విశాఖపట్నం | 28.1 | 71.7 | 52.5 | 56.6 |
| విజయనగరం | 27.3 | 48.7 | 50.5 | 44.9 |
| పశ్చిమగోదావరి | 26.9 | 52.9 | 51.9 | 41.6 |
| వైఎస్సార్ కడప | 22.8 | 53.5 | 43.5 | 41.4 |
| ఆంధ్రప్రదేశ్ | 27.2 | 58.9 | 50.3 | 45.2 |



# భారత్‌కి అసర్ 2024 పాఠం




భారతీయ అమెరికన్ రిపబ్లికన్ పార్టీ నేత వివేక్ రామస్వామి ఇటీవల ఒక ట్వీట్ (ఎక్స్) చేశారు . అమెరికాలో 8వ తరగతి పిల్లల్లో 75 శాతం మందికి గణితంలో నైపుణ్యం లేదని, ఇది వారి పట్ల చేస్తున్న అన్యాయమని, అమెరికా భవిష్యత్తుని చైనా చేతుల్లో పెట్టడమేనని అన్నారు. అమెరికా స్కూల్ విద్య కంటే మన పాఠశాల విద్య అనేక రెట్లు అధ్వానంగా ఉంది. అయినా అమెరికా భయపడుతుందంటే, అభివృద్ధికి విద్యా ప్రమాణాలు ఎంత కీలకమో అర్థమవుతుంది. భారత్ పాల్గొన్న ఏకైక 'పీసా' అంతర్జాతీయ సర్వేలో ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల్లో షాంఘై చైనా తొలి స్థానాన్ని సాధిస్తే, మన దేశం 74 దేశాల్లో చివరి నుంచి రెండో స్థానం 73వ స్థానంలో ఉంది. 'పీసా' తో పోలిస్తే చాలా ప్రాథమిక స్థాయిలో ఉండే అసర్ సర్వేలో మెరుగ్గా ఉంటాయనుకుంటున్నా, గణాంకాల ప్రకారం చూసినా, మనం చేయాల్సింది ఎంతో ఉంది. భారతీయ విద్యార్థులు ఎంతో కష్టపడతారో అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు బరాక్ ఒబామా ఆ దేశంలోని మిగతా వర్గాల్ని హెచ్చరించారు. భారత్‌లోనూ మన పిల్లలు కష్టపడుతున్నారు. తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేసి పిల్లల్ని చదివిస్తున్నారు. ఎన్‌రోల్‌మెంట్ సమస్య లేదు. టీచర్లు కావలసినంతమంది ఉన్నారు. ప్రభుత్వం డబ్బు ఖర్చు చేస్తోంది. అయినా పనికొచ్చే చదువు అందడం లేదు.

అసర్ గ్రామీణ భారతదేశ సర్వే కావచ్చు, కానీ గ్రామీణ, పట్టణ, ప్రభుత్వ, ప్రైవేటు తేడా లేకుండా, విద్యా ప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నాయని ప్రభుత్వం వారు సొంతంగా చేస్తున్న సర్వేలు కూడా హెచ్చరిస్తున్నాయి. మార్కులకి, తరగతిస్థాయి పరిజ్ఞానానికి సంబంధం లేకుండా ఫలితాలున్నాయని జాతీయ అచీవ్‌మెంట్ సర్వే, రాష్ట్రాల స్థాయి సర్వేల్లో వెల్లడైంది.

ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్యను అందించడం ప్రభుత్వ బాధ్యత. కానీ ప్రభుత్వం చేస్తున్న ఖర్చు ఒక్కో బిడ్డ మీద పెరుగుతోంది తప్ప, చదువు రావడంలేదని తెలంగాణ ప్రభుత్వమే నియమించిన విద్యా కమిషన్ ఇటీవల ఇచ్చిన నివేదికలో తెలిపింది. విద్య కోసం ప్రభుత్వం బడ్జెట్లో గొప్పగా ఏమీ నిధుల్ని పెంచడం లేదు. కానీ ప్రైవేటులో చదువు వస్తుందేమో అన్న ఆశతో చాలామంది తల్లిదండ్రులు పిల్లల్ని స్తోమతకు మించి, ఫీజులు కట్టి మరీ వాటిల్లో చేరుస్తుండటం వల్ల ఒక్కో బిడ్డమీద చేస్తున్న ఖర్చులో పెరుగుదల నమోదువుతోంది. అసర్ 2024 తెలంగాణ సర్వేలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ స్కూళ్లలోనే ఎక్కువగా విద్యార్థులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. కానీ పట్టణ ప్రాంతాలు కూడా కలిపి మొత్తంగా చూస్తే 60 శాతం మంది పిల్లలు ప్రైవేట్ స్కూళ్లలోనే చదువుతున్నారని రాష్ట్ర విద్యా కమిషన్ తాజాగా తెలిపింది ఈ లెక్కన తెలంగాణలో ప్రభుత్వం ఒక్కో స్కూల్ విద్యార్థి మీద ప్రతి సంవత్సరం 1,10,000కి పైగా ఖర్చు చేస్తున్నట్లు లెక్క. ఆ డబ్బంతా ఉచిత ఫీజు అయినా, అందులో సగం లోపు ఫీజు సొంతంగా భరించి ప్రైవేటు స్కూళ్లలోనే పిల్లల్ని చేర్చడానికి మొగ్గు చూపుతున్న తల్లిదండ్రుల సంఖ్య పెరుగుతోంది. మనకున్న వనరులు డిమాండ్ రీత్యా ఈ పరిస్థితిని వేగంగా చక్కదిద్దగలం. అలా చేయడం అత్యవసరం.

దేశంలో సుమారు పది కోట్ల మంది పిల్లలు ప్రీ స్కూల్ స్థాయిలో ఉన్నారు. వీరిని ప్రీ- ప్రైమరీ తో సవ్యంగా అనుసంధానిస్తూ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలతో మూడో తరగతి వచ్చేసరికి కల్లా బలమైన పునాదిని ఏర్పరచాలి. మిగిలిన 14 కోట్ల మంది పిల్లలకు విద్యా ప్రమాణాలు పెంచేందుకు సాంకేతికతను వినియోగిస్తూ, ఒత్తిడి లేని పరీక్ష విధానాన్ని అనుసరించాలి. ఇందుకు ఎన్ఎల్‌పీ 20 తగిన రోడ్ మ్యాప్ అందిస్తుందని అసర్ 2024 రుజువు చేసింది. పాలకులు, రాజకీయ పార్టీలు, అధికార యంత్రాంగం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, సమాజం, మీడియా ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా తరహాలో యుద్ధ ప్రాతిపదికన కృషి చేస్తూ పిల్లల్లో విద్యా ప్రమాణాల్ని పెంచినపుడే 2047 కి వికసిత్ భారత్‌ని నిర్మించగలం. ❖

# దారితప్పిన పరిష్కారం.. జమిలి జపం

-డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



రాజకీయాల్లో, ప్రభుత్వాల విధానాల్లో, ఒక్కోసారి గ్రేషమ్ సూత్రం లాంటివి పనిచేస్తుంటాయి. ఆర్థికశాస్త్రంలో గ్రేషమ్ సూత్రం ఏమిటి? నాణ్యతగల నాణాలు, నాసిరకం నాణాలు- రెండూ చెలామణిలో ఉంటే కాలక్రమేణా నాణ్యమైన నాణాలు అంతర్థానమవుతాయి; నాసిరకం నాణాలు చెలామణీలో మిగిలిపోతాయి! అలాగే, ఆచితూచి, తగిన సాక్ష్యాధారాలతో, తర్కబద్ధంగా చేసిన బలమైన ఆలోచనలకు బదులు, చెడ్డవి, అనాలోచితమైనవి ప్రాచుర్యం పొందుతాయి. లోక్‌సభ, అసెంబ్లీలకు ఏకకాలం ఎన్నికలు అటువంటి ఒక అనాలోచితం. మీడియా, మధ్యతరగతి, రాజకీయాల్లో చాలామంది నేతలకు మాత్రం ఇదేదో బ్రహ్మాండంగా ఉన్నట్లు అనిపిస్తోంది.

ఏదో ఒక అంచెలో తరచూ ఎన్నికల వల్ల ఆటంకాలు ఎదురవటం, కారణమున్నా, లేకున్నా పాలనను స్తంభింప చేస్తుండటం పట్ల పలువురు ప్రజలు విసిగిపోయారు. మన రాజకీయ సవాళ్లకు సులభమైన, చిటికెలో లభించే పరిష్కారం ఉందనుకోవటం థ్రిల్లింగ్‌గానే అనిపిస్తుంది. జమిలి ఎన్నికలు అలాంటి ఆలోచనే. ఉద్దేశం కూడా ఎంతో మంచిది, కాని మన దేశ పరిస్థితులతో సంబంధం లేకుండా రూపొందించిన పేలవమయిన ప్రతిపాదన. ఏకకాల ఎన్నికల వల్ల వచ్చే గొప్ప ప్రయోజనాల కంటే, నిజమైన నష్టాలు చాలా ఎక్కువ అని పలు వ్యాసాల్లో నేను వాదించాను . నిజమైన రాజకీయ సంస్కరణల కోసం మనం మరింత లోతుగా పరిశీలించాలి.

'ఒకే దేశం- ఒకే ఎన్నిక' ప్రతిపాదన ఒకవేళ చట్టమయితే, మన ప్రజాస్వామ్యంపై గణనీయ ప్రభావం చూపుతుంది. ఒక అభిప్రాయానికి రావటానికి, త్వరపడి అమలుకు ముందు క్షుణ్ణంగా అధ్యయనం అవసరం.

ప్రభుత్వాలు విధానాల అమలుకు రెండు పద్ధతుల్ని అనుసరిస్తుంటాయి. ఒకటి, వాస్తవాల్ని, సాక్ష్యాల్ని ఓపిగ్గా, జాగ్రత్తగా సేకరించటం, తర్కాన్ని నిశితంగా అన్వయించి అత్యుత్తమ పద్ధతుల్లో నిజాన్ని నిగ్గు తేల్చటం, సృజనాత్మకత ఆలోచనలతో మన పరిస్థితులకు తగ్గట్లు అన్వయించటం. అలా రూపొందించిన విధానం విజయవంతవుతుంది, కొనసాగుతుంది. రెండోరకం, ఊహాగానంతో ముందుగానే ఒక నిర్ణయానికి వచ్చేసి, తర్కాన్ని గందరగోళంగా అన్వయించి, ఆ ఆలోచనని ఏదో ఒకరకంగా సమర్థించే ప్రయత్నం చేయటం. అలాంటివి విఫలమయ్యే అవకాశాలు అధికం. పెద్ద ఎత్తున నష్టం కూడా కలిగించవచ్చు.

రాజకీయ వ్యాఖ్యాతలు జమిలిపై రెండు పక్కలా చీలి పోయారు. కొన్ని వర్గాలు ఒకేసారి ఎన్నికలు బీజేపీకి లాభం చేస్తాయని, ప్రాంతీయ పార్టీలకు నష్టం కలిగిస్తాయని వాదిస్తున్నాయి. కానీ సాక్ష్యాధారాలు అందుకు అనుగుణంగా లేవు. మనలో చాలామంది ఎన్నికలలో స్థానిక ,రాష్ట్ర, జాతీయ – ఇలా మూడంచెల్లోనూ ఒకే పార్టీకి ఓటు వేస్తుం టారు. ఏ అంచెలో ప్రభుత్వం ఏం చేస్తుందో పట్టించు కోకుండా అన్ని స్థాయిలలో ఒకే పార్టీకి ఓటు వేయటం మన సమాజంలో సర్వ సాధారణం.

ఓటర్లు సాధారణంగా ఎక్కువ సందర్భాల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని పట్టించుకుంటారు. మౌలిక సేవలు, సౌకర్యాలు, అవసరాలు, సంక్షేమం- ఇలా ప్రజా జీవితాన్ని తాకే అంశాల్లో అత్యధికం రాష్ట్ర బాధ్యతల పరిధిలో కేంద్రీకృతమై ఉంటాయి. ఎక్కువమంది మనసుల్లో రాష్ట్రం రాజకీయానికి కేంద్ర బిందువు. దీంతో, అధిక శాతం ఓటర్లు ప్రతి ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగానో వ్యతిరేకం గానో ఓటు వేస్తుంటారు. జమిలిగా ఎన్నికలు జరిగినప్పుడు, రాష్ట్ర అసెంబ్లీకి, లోక్‌సభకు ప్రజలు వేర్వేరుగా ఓటు వేసిన సందర్భాలు చాలా అరుదుగా కనిపిస్తాయి.


వేర్వేరు ఎన్నికల్లో కూడా, రాష్ట్ర ప్రభుత్వం పట్ల అంచనాయే ఓటర్ల మొగ్గులో ప్రాధాన్యాంశమవుతుంది. భావోద్వేగాలు ముప్పిరి గొన్న 1984 లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ భారీ విజయం సాధించిన సందర్భం

లోనూ, పశ్చిమబెంగాల్లో మార్క్సిస్టు కూటమి తన ఆధిక్యతను కాపాడుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్.టి. రామారావు నాయకత్వంలో తెలుగుదేశం ఘన విజయం సాధించింది. లోక్‌సభలో అతిపెద్ద ప్రతిపక్షంగా అవతరించింది. 1984లోలా అసాధారణ భావోద్వేగాలవలన, ప్రజలు ఏకపక్షంగా ఓటు వేసిన సందర్భాల్లో కూడా రాష్ట్రస్థాయి అంశాలు ఓటర్ల మనసులపై ప్రభావం చూపాయి. మిగతా చోట్ల ఆధిపత్య పార్టీగా కాంగ్రెస్ విజయభేరి మోగించగా, ప్రతిపక్షం కకావికలమైంది. కర్ణాటకలో కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో గెలిచింది కానీ, కొన్ని నెలల తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో జనతా పార్టీ విజయం సాధించింది.

ఇటీవలి ఎన్నికలు కూడా ఇదే ఒరవడిని చాటుతున్నాయి. కేవలం కొన్ని నెలల తేడాతో వేరుగా ఎన్నికల వల్ల అసెంబ్లీ, లోక్‌సభ ఓటింగ్ సరళిలో తేడా వచ్చే అవకాశముందని వెల్లడైంది. మహారాష్ట్రలో మే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని కూటమి దారుణంగా దెబ్బతింది. కానీ కొన్ని నెలల తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో ఢంకా బజాయించి భారీ సంఖ్యలో స్థానాల్ని గెలుచుకుంది. అలాగే హర్యానాలో కూడా లోక్‌సభ ఎన్నికలలో ఓడిన బి.జె.పి తరువాత అసెంబ్లీ ఎన్నికలలో గెలిచింది.

కర్ణాటకలో మే 2023 అసెంబ్లీ ఎన్నికలను కాంగ్రెస్ గెలుచుకుంది. రాష్ట్రంలో బి.జె.పి పాలనలో అవినీతి విశృంఖలమైందనే భావన, అయిదారు హామీలతో కాంగ్రెస్ శ్రుతిమించిన తాత్కాలిక సంక్షేమ పథకాలను ప్రకటించటం ఫలితాల్ని ఆ పార్టీకి అనుకూలంగా మార్చాయి. కానీ ఏడాది తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో బి.జె.పి భారీ విజయం సాధించింది. అదేవిధంగా తెలంగాణలో డిసెంబర్ 2023లో ఆరు గ్యారంటీల దన్నుతో కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికలు గెలుచుకుంది. కానీ అసెంబ్లీ ఎన్నికల్లో నామమాత్రపు సంఖ్య సీట్లకు పరిమితమైన బి.జె.పి, ఆరు నెలల తర్వాత సగం లోక్‌సభ స్థానాల్ని గెలుచుకుంది. అంటే వేర్వేరుగా ఎన్నికలు జరిగితే, జాతీయ పార్టీలు ఒక ఎన్నికలో ఓడినా, తరువాత పుంజుకునే అవకాశముంటుంది. అలాకాక ఏకకాలంలో ఎన్నికలు జరిగితే, పైన పేర్కొన్న నాలుగు రాష్ట్రాలలో అటు లోక్‌సభ, ఇటు అసెంబ్లీ ఎన్నికలలో బి.జె.పి ఓడిపోయి ఉండేది. అంటే జమిలి ఎన్నికలు బి.జె.పికి లాభం అన్న వాదనకి ఆధారాలు లేవు.

జమిలి ఎన్నికల వల్ల ఖర్చు తగ్గుతుంది, పాలన మెరుగుపడుతుందనే వాదనకు ఆధారాలు లేవు. మొత్తంగా చూసినప్పుడు ఎన్నికల్ని ఒకేసారి నిర్వహించటం వల్ల ప్రజాధన వ్యయం తగ్గుతుందనేది వాస్తవం. ప్రస్తుత విలువ ప్రకారం జమిలి ఎన్నికతో ఐదేళ్ల కాలంలో ఎన్నికల ఖర్చు



రూ 6,000 కోట్ల దాకా తగ్గొచ్చు. కానీ యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు రోజుకు చేస్తున్న రూ 20,000 కోట్ల ఖర్చుతో పోలిస్తే ఇది పంటికిందకు కూడా రాదు. ఆ ఆదా కూడా ఒకేసారి ఎన్నికలు జరపటం కోసం మళ్లీ మళ్లీ ఆ ఎన్నికలు జరగకుంటేనే. ఆంధ్రప్రదేశ్‌లో జమిలి ఎన్నికలు జరిగాయి. మే 2024 ఎన్నికల్లో రూ.10,000 కోట్లు దాకా ఖర్చయిందని అంచనా. ఇందులో చాలా భాగం ఓటర్లను ప్రలోభ పెట్టేందుకే వెద జల్లారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో, గతంలో జమిలి ఎన్నికలు జరిగిన ఒడిషా, తెలంగాణల్లోనూ ఎన్నికల కాల మానిని కారణంగా పాలన మెరుగుపడిందనటానికి ఆధారం లేదు.

ప్రజాస్వామ్యాన్ని మెరుగుపరచాలంటే ఓటర్లు మరింత విచక్షణతో, ఏ స్థాయిలో ఎవరికి ఓటేస్తున్నామో తెలిసి, వారి బాధ్యతలని అర్థం చేసుకుని ఓటు వేసే రకంగా వ్యవస్థని సరిదిద్దాలి. అలాకాక ప్రజల అవగాహన పెరగకుండా అన్ని స్థాయిలలో ఒకే రకంగా ఓటు వేయటం వల్ల వ్యవస్థ మెరుగుపడదు. ఎన్నికలు మొక్కుబడిగా జరిగి, ఎన్ని సార్లు ఎన్నికల్లో ఓటు వేసినా నిజమయిన మార్పుకి నాంది పలకవు.

మన ప్రజాస్వామ్యంలో తీవ్ర లోపాలున్నాయి. మన రాజకీయ ప్రక్రియని చట్ట విరుద్ధ, లెక్కలు చూపని విపరీత వ్యయం శాసిస్తోంది. అత్యుత్తమ సామర్థ్యం గలవారు రాజకీయాల పట్ల ఆసక్తి కనబరచటం అరుదైపోయింది. నైతిక, హేతుబద్ధ పద్ధతుల్లో అధికారంలోకి రావటం అసాధ్యమనే పరిస్థితులు నెలకొన్నాయి.

ఈ సవాళ్లను ఎదుర్కోవటానికి మనకు సంస్కరణలు కావాలి. కానీ జమిలి ఎన్నికలు సమాధానం కాదు. తమ ఓట్లకు, తమ జీవితాలకు మధ్య మరింత స్పష్టతను మనం ఓటర్ల మనసుల్లో పెంపొందించాలి.

రాజకీయ సంస్కరణల పట్ల మనకు స్పష్టమైన అవగాహన కావాలి తప్ప, ఏదో ఒకటి చేసేద్దామని వ్యవహారించకూడదు. ప్రజాస్వామ్య పరిణతిని పెంచే విధంగా, లోతైన ఆలోచనతో సంస్కరణలని చేపట్టాలి.

❖

# ఎస్.సి వర్గీకరణ ఉద్యమాన్ని మలి దశకు తీసుకెళ్లాలి: జేపీ



ఎస్.సి వర్గీకరణ ఉద్యమం న్యాయమైనదని, రిజర్వేషన్ ఫలాలు కేవలం కొందరికే కాకుండా అణగారిన, అవకాశాలు అందని కులాల్లోనూ అట్టడుగున ఉన్న కోట్లాదిమందికి అందాలని ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్) లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. హైదరాబాద్ ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో ప్రొఫెసర్ కాశీం అధ్యక్షతన జరిగిన 'ఎస్.సి రిజర్వేషన్ వర్గీకరణ అమలకు మేధావుల సంఘీభావ సభ'లో జేపీ మాట్లాడుతూ, వర్గీకరణకు వ్యతిరేకంగా వాదనను వినిపించే హక్కు ప్రజాస్వామ్యంలో ఉందని, అయితే అవి గడుసుతనంతో, మీ ఇంటికి వస్తే ఏమిస్తావు, మా ఇంటికి వస్తే ఏం తెస్తావు రీతిలో ఉండకూడదన్నారు. వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలన్నారు. ఇందుకోసం తనలాంటి వారంతా కలిసి వస్తామన్నారు. అయితే ప్రభుత్వంలో నూటికి మూడు ఉద్యోగాలు మాత్రమే ఉన్నాయని, మిగతా 97 మందికి మార్కెట్లోనే ఉపాధి అవకాశాలు దొరికేలా నైపుణ్యాలు అందాలన్నారు. ఉత్పాదకతను పెంచే సామర్థ్యం ఉండాలన్నారు. కానీ ఇందుకు కీలకమైన విద్య, ఆరోగ్యం మన దేశంలో అధ్వానంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా పాఠశాల విద్య విఫలం అవడం వల్ల 80 శాతం మంది పిల్లలు మేధస్సు వికసించడంలేదని, ఇందులో అత్యధికులు దళిత, వెనుకబడిన వర్గాల పిల్లలేనన్నారు. రిజర్వేషన్ ఫలాలు పొందిన వారు కూడా దీనివల్ల ఫలితాలు సాధించడంలో సమస్య ఎదుర్కొంటున్నారన్నారు. విద్య మీద ప్రభుత్వం ఒక్కో బిడ్డపై తెలుగు రాష్ట్రాల్లో 1,10,000 దాకా ఏటా ఖర్చు చేస్తున్నా పనికొచ్చే చదువు అందటం లేదన్నారు. ఆర్థిక భారం లేకుండా ఆరోగ్యం అందించకపోవడం వల్ల ఈ దేశంలో ఏటా ఆరు కోట్ల మంది దాకా పేదరికంలోకి జారిపోతున్నారని, వారిలో అత్యధికులు మళ్లీ దళిత, అణగారిన ఇతర కులాల వారేనన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమం ప్రారంభించిన మందకృష్ణ తలుచుకుంటే ప్రభుత్వ ఉద్యోగం వచ్చేదని, అలా ఉద్యోగం లేని కోట్లాదిమంది దళితుల పిల్లలకు రిజర్వేషన్లకు ఆవల, మార్కెట్లో నిజమైన పరిష్కారాల కోసం రిజర్వేషన్ ద్వారా లబ్ధి పొందిన ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర రంగాల వారు ఆలోచించాలన్నారు. కేవలం మూడు శాతానికి ఉపయోగపడే రిజర్వేషన్లకు పరిమితమైతే మందకృష్ణ 30 ఏళ్ల ఉద్యమానికి అర్థం ఉండదని, ఉద్యమాన్ని మలిదశకు విస్తరించి, ప్రతీబిడ్డకు నాణ్యమైన పాఠశాల విద్య, ప్రతి కుటుంబానికి మంచి ప్రమాణాల ఆరోగ్యం జేబు ఖర్చు లేకుండా ప్రభుత్వమే విధిగా అందించేలా చేయటానికి వినియోగించాలన్నారు. అదేవిధంగా కీలకమైన చట్టబద్ధ పాలన బాధ్యతలో ప్రభుత్వం విఫలమై బడితే ఉన్నవాడిదే బర్రె, కండబలంతో బండ న్యాయం వల్ల దళితులు, పేదలే ఎక్కువగా నష్టపోతున్నారని, అందువల్ల చట్టబద్ధ పాలనను ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేసేలా మనందరం పోరాడాలన్నారు. వర్గీకరణ కోసం చేసిన సుదీర్ఘ పోరాటంలో మందకృష్ణ హింసకు పాల్పడకుండా రాజ్యాంగబద్ధ పద్ధతుల్ని, డాక్టర్ అంబేద్కర్ చెప్పిన 'బోధించు-సమీకరించు- ఉద్యమించు' మార్గాన్ని అనుసరించడం అభినందనీయమన్నారు. ఎస్.సి వర్గీకరణ వ్యతిరేకులు కృష్ణపట్ల ఉపయోగిస్తున్న భాష అభ్యంతరకరమని, నిజంగా అంబేద్కర్ పట్ల గౌరవం ఉంటే బాబాసాహెబ్ చెప్పినట్లు వలస పాలన నాటి పద్ధతులను వీడి, పరస్పర గౌరవంతో, సహనంతో రాజ్యాంగబద్ధ పద్ధతుల్లో భావాలను వ్యక్త పరచాలని స్పష్టం చేశారు. ఆర్థికాభివృద్ధి, అందరికీ అవకాశాల కోసం కలిసికట్టుగా పోరాడదామని జేపీ విజ్ఞప్తి చేశారు. ఎస్.సి వర్గీకరణను కోరుకునే జనాభా తెలంగాణలో అధికంగా ఉందని, వ్యతిరేకించే శక్తులూ ఇక్కడే ఎక్కువగా ఉన్నాయని ముఖ్య అతిథి మందకృష్ణ అన్నారు. మద్దతు ఇచ్చిన మేధావులకు కృతజ్ఞతలు తెలిపారు.

❖

# ఎస్.సి వర్గీకరణను వేగిరం పూర్తి చేయాలి ముఖ్యమంత్రికి మేధావుల లేఖ

ఎస్.సి వర్గీకరణను సత్వరమే పూర్తి చేసి.. సామాజిక న్యాయ సాధనకు కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలంగాణలోని 20 మంది మేధావులు కోరారు. ఈ మేరకు లోక్‌సత్తా అధినేత డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కోదండరాం, దేశపతి శ్రీనివాస్, కె.నాగేశ్వర్, తీన్మార్ మల్లన్న, సీనియర్ ఎడిటర్ కె. శ్రీనివాస్ నందిని సిదారెడ్డి, విమలక్క, సూరేపల్లి సుజాత, బంగ్లా భూక్య, ఈసం నారాయణ, బూరం అభినవ్, గజవెల్లి ఈశ్వర్, ఆరేపల్లి రాజేందర్, కొండా నాగేశ్వర్, గడ్డం మల్లేశం, వెంకట్ మారోజు, సి, కాశీం ముఖ్యమంత్రికి లేఖలు రాశారు.

“రాజ్యాంగ నిర్మాతలు రిజర్వేషన్లు కల్పించి 75 ఏళ్లు అవుతున్నా ఎస్.సి కులాలన్నింటికీ సమానంగా ఫలాలు అందలేదు. గత పాలకుల ఉదాసీనతే అసమాన తల పెరుగుదలకు కారణమైంది. అవి తొలగిపోవడానికి, ఎస్.సి వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ గత 37 గా సుదీర్ఘ పోరాటం చేస్తోంది. ఈ క్రమంలో 2024 ఆగస్టు 1న ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు వెలువరించింది. వర్గీకరణ ద్వారానే 14, 15, 16 ఆర్టికల్‌ల ఉద్దేశం నెరవేరుతుందని అభిప్రాయ పడింది. ఎస్.సి వర్గీకరణను అమలు చేస్తామని తీర్పు వెలువడిన రోజే శాసనసభలో మీరు ప్రకటన చేయడంతో సామాజిక న్యాయం కోరుకునే వారందరం సంతోషపడాము. మంత్రివర్గ ఉప సంఘం, ఏకసభ్య కమిషన్‌ల ఏర్పాటు, వర్గీకరణ ప్రక్రియ వేగవంతం కావడానికి దోహదపడింది. కమిషన్ నివేదిక రూపొందించడానికి, అమలుకు ఉన్న శాసన ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి” అని వారు లేఖలో కోరారు.

# రిజర్వేషన్ సంస్కరణలపై శాసన వ్యవస్థ నిర్ణయించాలి

కోటా ప్రయోజనాలను పొంది ఇతరులతో పోటీపడే స్థితికి వచ్చిన వ్యక్తులను రిజర్వేషన్ నుంచి మినహాయించాలా లేదా అనే అంశంపై శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలే నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆగస్టులో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు ఆధారంగా వేసిన పిటిషన్‌పై ధర్మాసనం ఇటీవల ఈ మేరకు పేర్కొంది.

గత 75 ఏళ్ళను పరిగణలోకి తీసుకొని మా అభిప్రాయాన్ని తెలియపరిచాం. ఇప్పటికే ప్రయోజనాలను అందుకొని ఇతరులతో పోటీపడే స్థితికి వస్తే అలాంటి వ్యక్తులను రిజర్వేషన్ నుంచి మినహాయించాలి. కానీ ఈ నిర్ణయాన్ని కార్యనిర్వాహక శాసన వ్యవస్థ తీసుకోవాలి అని జస్టిస్ గవాయి తెలిపారు. షెడ్యూల్డ్ కులాలను ఉపవర్గీకరించే రాజ్యాంగబద్ధ అధికారం రాష్ట్రాలకు ఉందని రాజ్యాంగ ధర్మాసనం గతేడాది మెజార్టీ తీర్పును వెలువరించిన సంగతి తెలిసింది. ఆ ధర్మాసనములో సభ్యుడైన జస్టిస్ గవాయ్ విడిగా రాసిన తీర్పులో ఎస్.సి, ఎస్.టిల్లో సంపన్న శ్రేణిని క్రిమిలేయర్‌గా గుర్తించాల్సిన విధానాన్ని రాష్ట్రాలు రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పిటిషనర్ తరపు న్యాయవాది ఈ తీర్పును ఉటంకిస్తూ



క్రిమిలేయర్‌ను గుర్తించే విధానాన్ని ఏర్పరచుకోవాలని రాజ్యాంగ ధర్మాసనం చెప్పి ఆరు నెలలైనా ఇంకా రాష్ట్రాలు రూపొందించలేదని తెలిపారు. ఈ విషయంలో అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకోవాలని కోరారు. ఇందుకు ధర్మాసనం చట్టసభ్యులే చట్టాల రూపొందించాలి అని తెలిపింది.

# ప్రజలు ఓటుకు డబ్బెందుకు తీసుకుంటున్నారో ఎప్పుడైనా లోతుగా ఆలోచించామా?

**-డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-**




'దేశమంటే మట్టి కాదోయ్ ... దేశమంటే మనుషులోయ్' అని మహనీయుడు గురజాడ అప్పారావు చెప్పిన ఒక్క వాక్యం అర్ధమైతే మనకు స్వతంత్రం, రాజ్యాంగం, రాజకీయం, పరిపాలన ఏమిటో, ఎందుకో స్పష్టంగా అర్ధమవుతాయని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. సమాజంలో మార్పు కావాలంటే నిజాయితీగా చర్చ కావాలన్నారు. నేడు గొంతెత్తి అరవటం, బూతులు తిట్టుకోవటం, బస్తీ మే సవాల్ అంటూ తొడలు కొట్టటం గొప్ప చర్చగా అనుకుంటున్నారని, అది ప్రజాస్వామ్యం కాదని హితవు పలికారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ హక్కులు, బాధ్యతల ద్వారా అందించిన స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావాలను అందరూ పాటించాలన్నారు.

జాతీయ ఓటరు దినోత్సవం, భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్ళు పూర్తి చేసుకున్న రిపబ్లిక్ డే సందర్భంగా కార్యక్రమంలో విజయనగరంలో జేపీ మీడియా ద్వారా మాట్లాడారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, ఇతర నేతలు పాల్గొన్నారు.

గ్రామాలు, పట్టణాలు, డబ్బు, కులం, మతం, స్త్రీ, పురుష తేడా లేకుండా స్వతంత్రం వచ్చిన తొలి ఎన్నిక నుండి అందరికీ సమానంగా ఓటు హక్కు అందించిన మొట్టమొదటి దేశం భారత్ అని జేపీ అన్నారు. అభివృద్ధి, పరిణతి సాధించిన బ్రిటన్, అమెరికా దేశాలే రాజకీయ వివక్ష లేకుండా అలా ఓటు హక్కును అందివ్వటానికి శతాబ్దాల కాలం తీసుకున్నాయన్నారు. మన దేశంలో ఊహించటమే కష్టమైనంత వైవిధ్యం, అధికారికంగానే గుర్తించిన 22 భాషలు ఉన్నప్పటికీ గొప్ప ఆశలతో భవిష్యత్తుపై నమ్మకంతో రిపబ్లిక్‌ను జాతీయోద్యమ నేతలు ఏర్పాటు చేశారన్నారు.

అసాధ్యమనుకున్న రిపబ్లిక్‌ను భారత రాజ్యాంగం సుసాధ్యం చేసిందని, 75 ఏళ్ళలో ఫెడరల్ వ్యవస్థ బలపడి, అధికారాలు రాష్ట్రాలకు వచ్చాయని జేపీ తెలిపారు. ఈవేళ రాష్ట్రాల భవిష్యత్తు ఆ రాష్ట్రాల చేతుల్లోనే ఉందన్నారు. దీనివల్ల బాధ్యత గల రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఇదే సమయంలో గొప్ప విజయాల్ని వెన్నంటి ఘోర పరాజయాలు కూడా ఉన్నాయన్నారు. సోషలిజానికి పిచ్చి అర్థం చెప్పి లైసెన్స్ – పర్మిట్ – కోటా రాజ్యాన్ని కొనసాగించటం, సామాన్య, మధ్యతరగతి వర్గాలకు సరైన విద్య, ఆరోగ్యం

అందించకపోవటం వల్ల పేదరికం, వివక్షలు ఇంకా కొనసాగుతున్నాయన్నారు. సంస్కరణలతో ఆర్థికరంగం కొంత మెరుగైనా, ఎన్నికల్లో అక్రమ డబ్బు, తాత్కాలిక తాయిలాల వల్ల పాలన పెద్దగా మెరుగుపడలేదన్నారు. ఆ మెరుగుదల కూడా సాంకేతిక వినియోగం వల్లనే ఎక్కువ సాధ్యపడిందన్నారు. విద్య, ఆరోగ్యం ఇప్పటికీ అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. ఇంత అధికార కేంద్రీకరణ మరే గణనీయ దేశంలోనూ లేదన్నారు. పంచాయతీలు, మునిసిపాలిటీల్లో ఎన్నికలు జరుగుతున్నా అక్కడ ఎటువంటి అధికారాలు, నిధులూ లేకుండా పోయాయన్నారు. రాజకీయ పార్టీలు, మీడియా, అధికార యంత్రాంగం, సంపన్నులు, పారిశ్రామిక వేత్తలు – ఈ తప్పులకు బాధ్యత తీసుకోవాలితప్ప ప్రజల మీదకు నెట్టకూడదన్నారు. ప్రజలు ఎన్నికల్లో ఓటుకి డబ్బెందుకు తీసుకుంటున్నారో గొంతున్న ఈ అయిదు వర్గాలు ఎప్పుడైనా లోతుగా ఆలోచించాయా అని ప్రశ్నించారు. ప్రజలకు ఓటంటే ఏమిటో అర్థంకాని, రెక్కాడితేగానీ డొక్కాడని, జీవన భద్రత లేని వ్యవస్థల్ని నిర్మించటం వల్ల డబ్బు, తాత్కాలిక పథకాలకు ఆశపడుతున్నారన్నారు.

ఓటు, అభిప్రాయాలను చెప్పే స్వేచ్ఛ ఉన్నప్పుడు వలస కాలం నాటి నిరసన పద్ధతుల్ని అనుసరించటం, ఇతరుల హక్కులకి ఆటంకం కలిగించటం తగదని రాజ్యాంగాన్ని సభలో ప్రవేశపెడుతూ అంబేద్కర్ చాలా స్పష్టంగా చెప్పినా, మనలో ఎక్కువమంది ఇప్పటికీ పాటించటం లేదని జేపీ విమర్శించారు. రాజకీయ పార్టీలు కులాలు, మతాలు, ముఠాలుగా విడిపోయి, విద్వేషాల్ని వ్యాపింపజేస్తున్నాయని, కండబలంతో బండన్యాయం అమలవుతోందన్నారు. గత అయి దేళ్ళ పాలన చూస్తే ఆంధ్రప్రదేశ్‌లో చట్టం ఉందనుకోవటం అమాయకత్వమేనన్నారు. విషబీజాలు నాటితే అమృత ఫలాలు రావని, నాయకుల వ్యక్తిగత జీవితాల గురించి మనకు అనవసరమన్నారు. మన గురించి, మన పిల్లల గురించి, అభివృద్ధి, భవిష్యత్తుకి అవసరమైన ఉమ్మడి ప్రయోజనాలను సక్రమంగా అందించే రాజకీయం, పాలన గురించి ఆలోచించుకుందామన్నారు.

తర్కబద్ధ బహిరంగ చర్చ; స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావ త్రయం ఒక త్రిశూలంలా కొనసాగటం; సమాజంలో వనరులు, గొంతు ఉన్న అయిదు వర్గాలూ బాధ్యత తీసుకోవటం – మన రిపబ్లిక్ సుస్థిర మనుగడకు కీలకమని జేపీ పేర్కొన్నారు.

**జమిలి ఎన్నికలు నిరర్థకం**

మునిసిపాలిటీ, రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రభుత్వాల మధ్య తేడా తెలియకుండా ఓట్లు వేసే ధోరణి ఎక్కువగా ఉన్న మన దేశంలో ప్రజాస్వామ్య పరిణతిని పెంచేందుకు ఏకకాల ఎన్నికలు ఏవిధంగానూ ఉపయోగపడవని, కొత్త సమస్యలు సృష్టిస్తాయని ఒక ప్రశ్నకు సమాధానంగా జేపీ తెలిపారు.

**విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై 'అతి' వద్దు**

వ్యాపారం చేయటం ప్రభుత్వం పని కాదని, విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలోనూ ఈ వైఖరికి తాను కట్టుబడి ఉన్నానని జేపీ తెలిపారు. తనకు విజయనగరం, విశాఖపట్నం తేడాల్లేవని, వాస్తవాల ఆధారంగానే మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన జరిగితే అద్భుతాలు జరగవు, ఉపద్రవమూ రాదని ప్రత్యేక తెలంగాణ, సమైక్యాంధ్ర ఉద్యమాల సమయంలో అన్ని ప్రాంతాల్లో చెప్పానని, తన మాట నిజమని ఇప్పుడు రెండు రాష్ట్రాల ప్రజలకూ అర్థమైందని అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించేందుకు జాతీయస్థాయిలో రాజకీయ అనుకూలత ఉన్నందున ఆర్భాటాలకు పోకుండా ఉద్యోగులు తమ బాధ్యతల మీద దృష్టి సారించాలని సూచించారు.

❖

# ఆదాయపన్ను చెల్లించే వారికి రైతు భరోసా వద్దు

తెలంగాణలో రైతు భరోసా పథకాన్ని ఐదు ఎకరాల వరకు వ్యవసాయం చేస్తున్న రైతులకు మాత్రమే ఇవ్వాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు ఎం పద్మనాభరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. బడా భూస్వాములు, ఆదాయపు పన్ను ఎగ్గొట్టే వారికి రైతు భరోసా ఇవ్వరాదన్నారు. కౌలు రైతులకు కూడా న్యాయం చేయాలన్నారు. ఈ మేరకు ఇప్పటికే ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు. తెలంగాణలో రైతు కుటుంబాలు 50% లోపే ఉన్నాయని రాష్ట్ర బడ్జెట్ సింహభాగం రైతు సంక్షేమం పేరుతోనే ఖర్చు పెడితే మరి మిగిలిన వారి సంగతేమిటని, ఇతర రంగాల్లోని రైతు బిడ్డల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. చాలా రాష్ట్రాల్లో అధిక శాతం ప్రజాధనం సంక్షేమ పథకాల కోసమే ఖర్చు చేయడంతో అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడుతున్నాయని ఆర్బీఐ ఇటీవల తన నివేదికలో హెచ్చరించిన విషయాన్ని ప్రస్తావించారు.

# ఉచితాల వల్ల పేదరికం తగ్గుతుందా?

ఇటీవల ఎస్‌బీఐ రీసెర్చ్ ఒక నివేదికను వెల్లడించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లో గ్రామీణ పేదరికం గణనీయంగా తగ్గి 4.86 శాతానికి పరిమితమైందని తెలిపింది. 2011-12లో గ్రామీణ పేదరికం 25.7 శాతంగా ఉంది. అదేవిధంగా 2011-12లో 13.7 శాతంగా వున్న పట్టణ పేదరికం దాదాపు 4.09 శాతానికి చేరిందని అంచనా వేసింది.

+ ఎస్‌బీఐ రీసెర్చ్ ప్రకారం ... 2022-23 కంటే కూడా పేదరికం దేశంలో తగ్గింది. గ్రామీణ పేదరికం 2022-23లో 7.2 నుంచి 2023-24లో 4.86 శాతానికి పరిమితమైంది. పట్టణ పేదరికం 4.6 శాతం నుంచి 4.9 శాతానికి తగ్గింది. జనాభా గణన పూర్తయి, వివరాలు విడుదలైతే గ్రామీణ, పట్టణ ప్రాంతాల గణాంకాల్లో స్వల్పంగా మార్పులు చోటు చేసుకోవచ్చు.

+ పట్టణ పేదరికం మరింత తగ్గే అవకాశం ఉందని, ఇది 4 శాతం దాకా వుండొచ్చని, తీవ్రమైన పేదరికం చాలావరకూ తగ్గిందని నివేదిక పేర్కొంది.

1991లో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ఫలితాలు ప్రభావం చూపడం మొదలుపెట్టాక, 21వ శతాబ్దం ఆరంభం నుంచీ పేదరికం గణనీయంగా తగ్గిందనటంలో ఎలాంటి సందేహం లేదు. సముద్రమట్టం పెరిగితే ఎలాగైతే పడవలన్నీ పైకి వస్తాయో, అదేవిధంగా సంపద పెరగటం వల్ల దేశం మొత్తం లబ్ది పొందింది. ఫోన్లు, విద్యుత్తు, వాహనాలు, దుస్తులు, ఇతరత్రా సౌకర్యాలు, ఆదాయావకాశాలు ఏదోక స్థాయిలో అందరికీ అందుబాటులోకి వచ్చాయి.

తమ పూర్వీకుల కంటే మెరుగ్గా లేము అని ఒక్క కుటుంబం కూడా ఈరోజు చెప్పలేదు. అయితే ... నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన వంటివి కొరవడటం వల్ల ఆ అభివృద్ధి అవకాశాలు సమ్మిళితంగా విస్తరించలేదు. ఆర్థిక అవకాశాలు సమానంగా అందకపోవడం వల్ల ప్రాంతాలు, వర్గాలు, వృత్తులు, వ్యక్తుల మధ్య అంతరాలు చాలా ఎక్కువగా వున్నాయి. పేదరికానికి మనదేశంలో ఇచ్చే నిర్వచనమే చర్చనీయాంశం. ఆ పరిధిలో కూడా సమ్మిళిత అభివృద్ధి అవకాశాలు కొరవడటం వల్ల పేదరికం నుంచి బయటపడినవారు మళ్లీ పేదరికం లోకి జారిపోవటం ఒక విషవలయంలా కొనసాగుతోంది. ఉదాహరణకు కేవలం అనారోగ్య ఖర్చుల వల్ల ఏటా అప్పటిదాకా పేదలు కానివారు 5.5 కోట్లమంది తిరిగి పేదరికం లోకి జారిపోతున్నారు.




ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదికలో కూడా ఆ రకమైన హెచ్చరిక అంతర్లీనంగా వుంది.

గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, రైతుల ఆదాయాన్ని పెంచే కొన్ని చర్యల వంటివి మినహాయించి, స్థిరంగా సంపద సృష్టిలో ప్రజల్ని భాగస్వాముల్ని చేసే చర్యలు పేదరికం తగ్గటంలో కీలకపాత్రను పోషించాయని నివేదిక పేర్కొనలేదు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేదరికం తగ్గటానికి ప్రధాన కారణంగా ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రత్యక్ష నగదు బదిలీ వంటి కార్యక్రమాలను చెప్పింది. కచ్చితంగా మనలాంటి పేద, ప్రజాస్వామ్య దేశంలో సంక్షేమ పథకాలు అవసరం. అయితే అభివృద్ధిని పణంగాపెట్టి కాదు! అభివృద్ధితో సమతూకం వుండేలా, తిరిగి అభివృద్ధికి దారితీసేలావుండాలి. అందువల్లే వ్యక్తిగతం, తాత్కాలికం, ఉపశమన సంక్షేమ పథకాలతో పేదరికం తగ్గడం శాశ్వత ఫలితాన్నిచ్చేలా కొనసాగడం కష్టం. సామూహికం, దీర్ఘకాలం, ఉత్పాదకతను పెంచుతూ స్వావలంబననిచ్చే కార్యక్రమాల తోనే పేదరికం తగ్గి సుస్థిరాభివృద్ధి, ఆదాయాల పెరుగుదల సాధ్యమవుతాయి.

**పోటాపోటీగా ...**

కానీ, దీర్ఘకాలపు అభివృద్ధిని పణంగా పెట్టి వ్యక్తిగత, తాత్కాలిక సంక్షేమ పథకాల్ని కొనసాగించటం రాష్ట్రాల్లో వున్నకొద్దీ పెరుగుతోంది. జాతీయస్థాయిలో ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తున్న బీజేపీ కూడా రాష్ట్రాల్లో తాత్కాలిక పథకాల విషయంలో పోటీకి వెనుకంజ వేయటంలేదు. రాజకీయాల్లో మార్పు కోసమంటూ లోక్‌సత్తా స్ఫూర్తితో ఆవిర్భవించిన 'ఆప్' విచక్షణారహిత పంచుడు కార్యక్రమాన్ని ఒక ప్రధాన ఎన్నికల అస్త్రంగా మలచడంతో, తమను గెలిపిస్తే ఆప్ ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ కొనసాగిస్తామని ప్రధానమంత్రి మోదీ స్వయంగా ఇటీవలి ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. ఆయన పార్టీ ఇంకొన్ని అడుగులు ముందుకేసి సంకల్ప పత్రం ప్రకటించి, అందులో గర్భిణులకు రూ.21,000, మహిళా సమృద్ధి యోజన కింద మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం, పేద కుటుంబ మహిళలకు ఐదొందల రూపాయలకే గ్యాస్ సిలిండర్; హోళీ, దీపావళి పండుగలకు ఉచిత సిలిండర్, ఆయుష్మాన్‌భారత్ కవరేజీని రూ.5 లక్షల మేరకు పెంచటం, వృద్ధుల పెన్షన్లు వగైరాలు హామీ ఇచ్చింది. దీనిపై ఆప్ వ్యవస్థాపకులు అరవింద్ కేజ్రీవాల్ స్పందిస్తూ, ఉచితాల హామీలపై (సొంత సొమ్మేదో దానం చేస్తున్నట్లు) తనను విమర్శించినందుకు ఇప్పటికైనా మోదీ క్షమాపణ చెప్పాలని




డిమాండ్ చేశారు. తన పార్టీ మేనిఫెస్టోలో ఇంకొన్ని హామీల్ని జతచేసి, అద్దెకుంటున్నవారికి కూడా ఉచిత విద్యుత్తు, మంచినీరును ప్రకటించారు.

**ఎవరు కట్టడి చేయాలి?**

ఇలా తాత్కాలిక సంక్షేమ పథకాలు మితిమీరుతూ, మౌలిక సదుపాయాల కల్పన కోసం కేటాయించిన నిధులను కూడా పలు రాష్ట్రాలు ఉచితాలంటూ కార్యక్రమాలకు మళ్లించటంపై 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్, ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ పనగడియా స్పందిస్తూ, ఆర్థిక వ్యవస్థపై అనుచిత భారం మోపే ఉచితాలు కావాలా? ... మెరుగైన జీవితాలకు ఉపయోగపడే మంచి రహదారులు, తాగునీరు, మురుగునీటి వ్యవస్థల వంటివి కావాలా? ప్రజలు

**నిరుద్యోగానికి ఉచితాలు పరిష్కారం కాదు !**
**మన దేశంలో నిరుద్యోగం అంతలా లేకపోవచ్చు. కానీ, నాణ్యమైన ఉపాధి అవకాశాలు, ఆ ఉన్నవాటిని కూడా అందుకునే నైపుణ్యాలు లేనిమాట వాస్తవం. ఈ సమస్యను ఎదుర్కోవడానికి బదులు ... తాత్కాలిక సంక్షేమ పథకాల్ని, నగదు బదిలీని అందించి, అవే ఉపాధి అవకాశాలకు ప్రత్యామ్నాయం అన్నట్టు ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు కూడా వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వోద్యోగాల పట్ల మోజును పెంచుతున్నాయి. ఉచితాలు, ఆమాటకొస్తే ప్రభుత్వోద్యోగాలు సమాజం లోని ఉపాధి అవకాశాలకు ప్రత్యామ్నాయం కాదు. నాణ్యమైన ఉపాధి అవకాశాలు లేకుండా పేదరికం పోదు. ఉచిత హామీ పథకానికీ ఇది వర్తిస్తుంది. ఈ వాస్తవాల్ని గుర్తించి, పరిష్కారాల్ని అందించే రాజకీయం, పాలనకు వేగంగా చర్యలు ఈవేళ్టి అవసరం.**

నిర్ణయించుకోవాలన్నారు. ఆర్థిక సంఘం సిఫారసులను రాజ్యాంగబద్ధ ఆదేశాల్లా అన్ని ప్రభుత్వాలూ అమలుచేస్తూ నిధుల్ని బదిలీ చేస్తున్నాయి. అయితే, అభివృద్ధి ప్రాజెక్టుల కోసం కేటాయించిన డబ్బును ఎలా ఖర్చుచేయాలనే తుదినిర్ణయం ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రభుత్వాలదే. "ఆర్థిక సంఘం దీనికి సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కాకపోతే, స్థూల ఆర్థిక స్థిరత్వ ప్రయోజనాల దృష్ట్యా సమస్యకు సంబంధించిన అంశాన్ని లేవనెత్తగలదు. ఎలా ఖర్చుచేయాలో నియంత్రించే అధికారం ఆర్థిక సంఘానికి లేదు" అని స్పష్టం చేశారు.


కాబట్టి సంక్షేమం, అభివృద్ధిల మధ్య సమతూకం పాటించడం, ఆ పరిధిలో సంక్షేమ పథకాల్ని కూడా ఉత్పాదకమైనవిగా జాగ్రత్త వహించడం, బాధ్యతని రాజకీయ నాయకత్వం సవ్యంగా నెరవేర్చేలా పౌరసమాజ సంస్థలు, ఆలోచనాపరులు ప్రజలను చైతన్యపరచాలి. దేశం సుస్థిరాభివృద్ధి లక్ష్యాన్ని అందుకోవడానికి ఆ సమతూకం ఎంతో కీలకం. అదేవిధంగా ఈ సమతూకానికి ఎఫ్‌డిఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ లాంటివాళ్లు సూచిస్తున్నట్టు రాజ్యాంగం లోని వెసులుబాటును ఉపయోగించి, అప్పులు చేసిన డబ్బును అభివృద్ధి పెట్టుబడులకు తప్ప ... తాత్కాలిక సంక్షేమ పథకాలు, ఇతర రోజువారీ ఖర్చులకు వెచ్చించకుండా నియంత్రించేందుకు ఎఫ్‌ఆర్‌బిఎమ్ తరహాలో చట్టబద్ధ ఏర్పాటు చేసి, సంఘానికి శాశ్వత ప్రతిపత్తితో ఆర్థిక క్రమశిక్షణను యూనియన్ ప్రభుత్వం దాకా అన్ని స్థాయిల్లో నిష్పాక్షికంగా, స్వతంత్రంగా అమలు చేసే సంస్థగా తీర్చిదిద్దే అంశాల్ని పరిశీలించాలి. ఇందుకు రాజ్యాంగంలోని వెసులుబాటును ఉపయోగించి యూనియన్ ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. ❖

# వడ్డీల తగ్గింపునకు ఏపీ చొరవ

ఈ వేళ దేశంలో ఆర్థికంగా అత్యంత గడ్డు సవాలును ఎదుర్కొంటున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. అదే సమయంలో దేశంలో ఎక్కడా లేని స్థాయిలో తాత్కాలిక సంక్షేమ హామీల్ని ప్రకటించిన రాష్ట్రం కూడా ఏపీయే. మహారాష్ట్ర , ఢిల్లీ లాంటి సంపన్న రాష్ట్రాలు కూడా ఇవ్వని స్థాయిలో పెన్షన్ పథకాల్ని ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తోంది. సంక్షేమమే పరిపాలన, అభివృద్ధి అక్కర్లేదనే రీతిలో వ్యవహరించిన గత ప్రభుత్వాన్ని ఓడించటానికి 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, మితిమీరిన హామీలిచ్చింది. జనసేన, బీజేపీతో కలిపి ఎన్డీయేలో భాగంగా అధికారానికి వచ్చినా ఆరు గ్యారంటీల వంటి భారీ హామీల్ని అమలు చేయలేక, రోజువారీ ఖర్చులకీ డబ్బుల్లేక టీడీపీ ప్రభుత్వం హైరానా పడుతోంది. అదే విధంగా అప్పులు, ఆదాయంతో సంబంధం లేకుండా విపరీత తాత్కాలిక సంక్షేమ హామీలనిచ్చి తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రోజువారీ ఖర్చుల కోసమే నెలకు రూ. 4,000 కోట్లు అప్పు చేయాల్సి వస్తోంది. ఉద్యోగుల జీతభత్యాలు, వడ్డీలు, సంక్షేమ పథకాలకు రూ. 22,500 కోట్లు అవసరమవుతున్నాయని, అభివృద్ధి పెట్టుబడులంటే అదనంగా అవసరానికి కానీ ప్రతి నెలా వచ్చే ఆదాయం రూ. 18,500 కోట్లు మాత్రమేనని ముఖ్యమంత్రి వాపోతున్నారు. ఈ నేపథ్యంలో అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మేలని, ప్రజలకు ఆర్థిక వాస్తవాలు వివరించి, హామీల్ని హేతుబద్ధీకరించి దశల వారీగా అమలు చేయాలని, మరికొన్ని సూచనలతో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు ప్రజాస్వామ్యపీఠం(ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవ స్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ హితవు పలికారు.

మరింత తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్ కు మరో సలహా ఇచ్చారు. యూనియన్ ప్రభుత్వంతో చర్చించి వడ్డీలు తగ్గింపు రుణాల చెల్లింపు వాయిదాకు వెసులుబాటు తీసుకోవాలని, దీనివల్ల ఆర్థికంగా కొంత ఊపిరి పీల్చుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. తెలుగేతర నిపుణులను కూడా కలుపుకొని విభజన హామీలపై జేపీ ఏర్పాటు చేసిన స్వతంత్ర కమిటీ నివేదిక ఆధారంగా ఏపీకి ఇప్పటికీ రూ 10,491 కోట్లు వరకు రెవెన్యూ లోటును యూనియన్ ప్రభుత్వం భర్తీ చేయగా, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతి, పోలవరం వంటి వాటికి కూడా పెద్ద ఎత్తున నిధులు విడుదలయ్యాయి. ఇప్పుడు వడ్డీ తగ్గింపు రుణాల రీ షెడ్యూల్ సూచనకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చొరవ చూపటంతో యూనియన్ ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. దీనివల్ల ఏపీకి ఏటా 3000 కోట్ల వడ్డీ భారం తగ్గుతుందని అంచనా.

రాష్ట్ర రుణాల రీ షెడ్యూల్‌కు ప్రధాని, యూనియన్ ఆర్థిక మంత్రితో ఏపీ ముఖ్యమంత్రి చర్చించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ




ముఖ్య కార్యదర్శి ప్రతిపాదనలని యూనియన్‌కు సమర్పించారు . వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభం నాటికి రుణాల రీ షెడ్యూల్ ప్రక్రియ కొలిక్కి వచ్చి వడ్డీ భారం తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. జనవరిలో మీడియాకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తూ ముఖ్యమంత్రి సైతం ఈ అంశాన్ని ప్రస్తావించారు. గతేడాది జూన్‌లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడే నాటికి ఏపీ రుణాలు పెండింగ్ బిల్లుల భారం కలిపి రూ. పది లక్షల కోట్ల వరకు ఉంటుందని ప్రభుత్వం తేల్చింది. మొత్తంలో ఐదు లక్షల కోట్లకు పైగా అప్పట్లో ఆర్బీఐ నుంచి తెచ్చిన రుణాలే. వీటి వడ్డీ ఏడు శాతం లోపు ఉంటుందని ఆర్థిక శాఖ లెక్కలు వేసింది. అవి గాక రూ. 2.50 లక్షల కోట్లు కార్పొరేషన్ రుణాలు ఉన్నాయి. వీటికి వడ్డీలు 12-13% వరకు ఉన్నాయి. మరోవైపు ఇతర బ్యాంకు నుంచి తీసుకున్న రుణాల మొత్తం రూ 70-80 వేల కోట్ల వరకు ఉంటుంది. అప్పట్లో తక్కువ వడ్డీకి రుణాలు తీసుకున్నా, గత ప్రభుత్వ హయాంలో సరిగా తిరిగి చెల్లించకపోవడం, ఇతర కారణాలతో వీటి వడ్డీలు 11 శాతానికి పెరిగిపోయాయని, పెనాల్టీలు కూడా చెల్లించాల్సి వస్తోందని ఆర్థిక శాఖ గుర్తించింది. ఈ నేపథ్యంలో కీలక కార్పొరేషన్ల నుంచి తీసుకున్న రుణాల వడ్డీలు తగ్గించేలా వివిధ బ్యాంకులకు చెల్లిస్తున్న 11% వడ్డీని 9%కు తగ్గించుకునేలా, ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంది. ఈ ప్రతిపాదనలను ఏపీ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఢిల్లీలో యూనియన్ ఆర్థిక శాఖ అధికారుల వద్ద ప్రస్తావించారు. వారి బ్యాంకులను సంప్రదించి వడ్డీలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మార టోరియం సమయపరిమితిని మార్చేలా ఏర్పాటు చేస్తున్నారు. ❖

# ప్రభావవంతంగా 'పాడ్‌కాస్ట్'

తాజా అమెరికా అధ్యక్ష ఎన్నికలలో పాడ్‌కాస్ట్ ప్రభావం ఎంతుందో చూశాం. ప్రధాన పార్టీలైన డెమొక్రటిక్, రిపబ్లికన్ అభ్యర్థులిద్దరూ పాడ్‌కాస్ట్‌ల ద్వారానే కొత్తతరం ఓటర్లకు, పెద్దగా రాజకీయాల్ని పట్టించుకోని మారుమూల ప్రాంతాలవారికీ చేరువయ్యారు. తటస్థ ఓటర్లని ప్రభావితం చేయగలిగారు. మన దేశంలోనూ ఎన్నికల్లో సోషల్ మీడియా ప్రభావం గణనీయంగా పెరిగినా, పాడ్‌కాస్ట్‌లు ఇంకా ప్రాచుర్యం లోకి రాలేదు. ఉన్న పరిమితుల్లోనూ మన పాడ్‌కాస్ట్‌లు కొద్దిమందిని మినహాయిస్తే అంత గొప్పగా అయితే లేవు. అవతలి వ్యక్తిని స్టిమ్యులేట్ చేయటం, ప్రజల కోణం నుంచి వీలైనంత ఎక్కువ పిండటం కాకుండా, కొందరు విమర్శకులు ఎత్తిచూపుతున్నట్లు సెల్ఫీ జర్నలిజం ఎక్కువ కనిపిస్తుంది. కనీసం లక్షిత వర్గాల ప్రయోజనాలనైనా నిష్పక్షికంగా నెరవేర్చే ప్రయత్నం పూర్తిస్థాయిలో కనిపించదు. పాడ్‌కాస్ట్‌లు ప్రాచుర్యం పొందిన అమెరికాలోనూ ఈ లోటు ఉన్నట్లు డొనాల్డ్ ట్రంప్, కమలా హ్యారిస్, చివరికి ఈమధ్యకాలంలో 'మెటా' వ్యవస్థాపకుడు జుకర్ బర్గ్‌తో సంభాషణని చూస్తే అర్థమవుతుంది. కాస్త లోతైన భావవ్యక్తీకరణలుగా భావించే పాడ్‌కాస్ట్‌లలో, ముఖ్యంగా సామూహిక ప్రభావం చూపే అంశాలపై ఇన్‌ఫ్లుయెన్సర్లు కల్తీ, నాసిరకం, లేదా ప్రజలను మభ్యపెట్టే అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తే కొత్తతరం సగటు ఓటరు తేలిగ్గా పొరపాటు అంచనాలు ఏర్పరచుకునే అవకాశం వుంది. ఓ సీనియర్ జర్నలిస్టు ఇటీవల వాపోయినట్లు, రైతుల ఆందోళన అంటే ట్రాఫిక్ జామ్ ఎంత జరిగింది, సినిమా అయితే ఎంత ఖర్చుపెట్టి తీశారు, గొప్ప వ్యక్తి అంటే ఎంత సంపాదించాడు, ఎంత ఖరీదైన జీవితం గడుపుతున్నాడు, మంచితనం అంటే ఎదుటివారికి మనం చేసిన కొద్దిపాటి సహాయానికి ఎంత ప్రచారం వచ్చింది … అనే పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత సమాచార వ్యవస్థలో సమస్య గురించిన వాస్తవికత, దీర్ఘకాలిక ప్రయోజనాలపై ఆలోచన రేకెత్తించటం కొంత సవాలే. కానీ, 'భావోద్వేగాల ద్వారా కంటే ఉపయోగం ద్వారానే తనకు ఎక్కువ ఆనందం కలుగుతుందని మనిషి గుర్తించటం పరిణామక్రమం' కాబట్టి ఆ సవాలును అధిగమించటం పూర్తిగా సాధ్యం. అందులోనూ ఆదర్శంలో ప్రస్తుత తరం ఏ తరానికీ తీసిపోదు. పాడ్‌కాస్ట్‌లతో, సోషల్ మీడియా ఇతర ప్లాట్ ఫారంలలో వున్నవారు కాస్త ముందు చూపుతో వ్యవహరిస్తే ప్రజల అవసరాల్ని, ఉపయోగాల్ని డిమాండ్‌గా మార్చి స్థిరమైన మార్కెట్ వృద్ధిని సాధించగలిగే ఎంట్రపెన్యూర్లు అవుతారు.

ఉపయోగం కంటే ఉద్వేగాలకు ప్రాధాన్యతనిచ్చే అపరిపక్వత మన దేశంలో పెద్దలలో, జుట్టు నెరిసిన ముదుసళ్లలో కూడా ఎక్కువే. అందుకే ప్రఖ్యాత తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి తరచూ అంటుండేవారు – ఈ దేశంలో పిల్లల కన్నా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సరైన విద్య కావాలి. అప్పటికీ, ఇప్పటికీ చదువుకున్నవారి సంఖ్య, సాంకేతిక వినియోగం పెరిగిందికానీ, తనకు, తన కుటుంబానికి, తన చుట్టూ వున్న సమాజానికి నిజంగా ఉపయోగమేంటి అని థ్రిల్స్‌ని దాటి ఆలోచించే పరిణతి ఇంకా మనలో ఎక్కువమందికి సమకూరలేదు. పెద్దలు ఉదాహరణలుగా నిలబడకపోతే, ఇన్‌ఫ్లుయెన్స్ చేసేవాళ్లు రోల్‌మోడల్స్ కాకపోతే, కొత్తతరంలో పరిణతిని పాదుకొల్పటం కాస్త కష్టమవుతుంది. పరిజ్ఞానం అంత తేలిగ్గా ప్రసారమవదు. ఈ నేపథ్యంలో ఇటీవల మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన తొలి పాడ్‌కాస్ట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. యువ ఎంట్రపెన్యూర్ నిఖిల్ కామత్ మోదీని ఇంటర్వ్యూ చేశారు. ఎంట్రపెన్యూర్‌షిప్ మీదే తాను పాడ్‌కాస్ట్‌లు చేస్తుంటానని, తనకు రాజకీయ విధానాల గురించి అంత అవగాహన లేదని ఆయన ముందుగానే తెలిపారు. దేశజనాభాలో అత్యధికంగా వున్న యువతకు కనెక్ట్ కావడం కోసమే తాను పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూ కోసం నిఖిల్ కామత్‌ను ఎంచుకున్నానని మోదీ చెప్పకనే చెప్పారు.

యూట్యూబ్ ఛానెల్స్‌కి, పాడ్‌కాస్ట్‌లకీ ఏ రూపంలో అయినా చాలా భవిష్యత్తు ఉందని ఎక్కువమంది అంచనా. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ అమెరికన్ స్కాలర్ ఒకామె, అమెరికా యువతలో ఎక్కువమంది సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లయ్యి మిలియన్లు సంపాదించాలని కలలు కంటున్నారని, కానీ వలసదారులపై అసూయపడాల్సిన అవసరం లేకుండా కష్టపడే వృత్తుల్లోకి కూడా వెళ్లటం అవసరమని హితవు పలికారు. పాడ్‌కాస్ట్‌లు విస్తరించటం, మరింత సాంకేతిక హంగులను సమకూర్చుకోవటం అవసరం. కానీ, సరైన వ్యక్తులతో, సరైన అంశాలపై, సరైన ప్రశ్నలు – పరిష్కారాలతో అవి ప్రామాణికంగా ఉండాలి. అలా ప్రమాణాలను పాటిస్తేనే సమాజానికి ప్రయోజనం చేకూరడం ద్వారా ఆదాయం పొందటం అవుతుంది, నిజమైన ఉపాధి పొందటం అవుతుంది.

సమాజంలో మార్పు సహజమని, అలా మార్పుకు తగ్గట్లు ఎంత వేగంగా మారితే, అంత విజయవంతమవుతామని చాలామంది చెబుతుంటారు. వాస్తవమేకానీ, మార్పుతో పాటు మారని విలువలు, ప్రమాణాలు కూడా కొన్ని ఉంటాయి. లేకుంటే, క్రీస్తుపూర్వం వ్యక్తులు, సాహిత్యంలోని ప్రమాణాలు, అందులోని అంశాల గురించి మనం ఈవేళ కూడా మాట్లాడుకోవలసిన అవసరం ఉండదు. పాడ్‌కాస్ట్‌లను, ఇతరత్రా సామాజిక మాధ్యమాలను సూత్రబద్ధత, లక్ష్యశుద్ధితో నడపగలిగినవారు ఆ కెరీర్‌లోకి వెళ్లగలిగితే వ్యక్తి లాభం – సమాజ హితం ఫార్ములాను సవ్యంగా ఆచరించిన వారవుతారు.

❖





# విద్యా కేంద్రంగా ఎల్లమ్మబండ కమ్యూనిటీ హాల్..
# సందర్శించిన ఎఫ్‌డీఆర్ బృందం


హైదరాబాద్ ఎల్లమ్మబండలోని కమ్యూనిటీ హాల్‌ను ఇటీవల అక్షయ విద్యాభ్యాస శిక్షణ కేంద్రం కోసం కేటాయించిన సందర్భంగా ఎఫ్‌డీఆర్ వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో సంస్థ బృందం సందర్శించింది. దీనివల్ల విద్యార్థులు, ట్యూటర్లు, కమ్యూనిటీకి ఒక బలమైన వేదికగా అక్షయను తీర్చిదిద్దుతామని, ఎల్లమ్మబండ ప్రాంత రూపురేఖల్ని, దశను మారుస్తామని నిర్వాహకులు తెలిపారు. ఒకప్పుడు చెత్తాచెదారం, దుర్గంధంతో నిరుపయోగంగా పడి ఉన్న కమ్యూనిటీ హాల్‌ని శుభ్రపరచటంలో, మౌలిక వసతుల్ని సమకూర్చటంలో సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. అసంపూర్ణ పనుల్ని త్వరలో పూర్తి చేస్తామన్నారు. స్థానిక ప్రజలతో మాట్లాడిన జేపీ, కమ్యూనిటీ హాల్‌ని విద్య, అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దటానికి అవసరమైన అన్ని రకాల సాయం అందిస్తామని హామీ ఇచ్చారు.







RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th FEBRUARY, 2025 Posting Date 15 &16th of every month




విజయవాడలో జరిగిన ప్రపంచ నాస్తిక సదస్సులో ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్






*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.**
**Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.**